తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట
యాద్రాద్రి భువనగిరి
శనివారం
22 ఆగష్టు 2026
పేజీలు : 8

# ఉపాధ్యాయుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

## ట్రస్మా జిల్లా అధ్యక్షులు రవీందర్ రెడ్డి




**జనంసాక్షి,మిర్యాలగూడ:**
ఉపాధ్యాయుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ట్రస్మా జిల్లా అధ్యక్షులు రవీందర్ రెడ్డి అన్నారు. నాగార్జున కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపల్ కల్లు రూపా రెడ్డి దారుణ హత్యను ఖండిస్తూ తెలంగాణ రేకగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మిర్యాలగూడ లో శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులకు భద్రత కల్పించడంతో పాటు విద్యా సంస్థల్లో భయరహిత వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు.ఎన్నెస్పి క్యాంప్ గ్రౌండ్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించిన , అనంతరం ఎమ్మెల్యే, డీఎస్పీ, ఆర్డీఓలకు వినతి పత్రాలను అందజేశారు. ఉపాధ్యాయులపై బెదిరింపులు, దాడులు, వేధింపులను అరికట్టేందుకు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు.పాఠశాలల పరిసరాల్లో మత్తు పదార్థాల విక్రయాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని, డ్రగ్స్ నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాలని ఎఖీూఓం నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థుల భద్రత కోసం పాఠశాలల సమీపంలోని దుకాణాల్లో తరచూ తనిఖీలు నిర్వహించాలని, మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థునుల భద్రతకు షీ టీమ్స్ను బలోపేతం చేయాలని కోరారు. అలాగే ప్రైవేట్ ఉపాధ్యాయులకు చట్టపంమైన అంశాలు, సైబర్ భద్రత, డ్రగ్స్ నివారణ, మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, పాఠశాలల సమస్యలపై పోలీసులను తక్షణం సంప్రదించేందుకు ప్రత్యేక నోడల్ అధికారి లేదా హెల్ప్డెస్క్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ర్యాలీకి మున్సిపల్ చైర్మన్ సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, వార్డు కౌన్సిలర్ దేశరెడ్డి శేఖర్ రెడ్డి మద్దతు తెలిపి ర్యాలీలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కవచం నాగరాజు, వంగాల నిరంజన్ రెడ్డి, మారుతి అమరేందర్ రెడ్డి, అలుగువెల్లి శ్రీనివాస్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, కే.కే. జయరాజన్, అయ్యన్న, శ్రీనివాస్, సాయి శ్రీనివాస్, మహమ్మద్, రవీందర్ రెడ్డి, కందాల శ్రీనివాసాచారి, వరప్రసాద్, సోమయ్య, మధుసూదన్, శ్యామ్, రియాజ్, సైదులు, శ్రీధర్ రెడ్డి, రాంరెడ్డి, నీలిమ, చంద్రకళ, అనిత, ఉమా, శ్రీకాంత్, వెంకట్, నర్సిరెడ్డి, చార్లెస్, కలీం, సురేందర్ రెడ్డి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.



## కొత్తగూడెంలో ఘనంగా

# శ్రావణ వరలక్ష్మి వ్రతం

### మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి గృహంలో ఆధ్యాత్మిక శోభ!

**కొత్తగూడెం 21 ఆగస్టు జనంసాక్షి**
కొత్తగూడెం పట్టణంలో పవిత్ర శ్రావణ మాస వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, కనులపండువగా కొనసాగుతున్నాయి. ఈ శుభ సందర్భాన, కొత్తగూడెం పట్టణ మాజీ మున్సిపల్ చైర్ పర్సన్, ప్రముఖ నాయకురాలు శ్రీమతి కాపు సీతాలక్ష్మి స్వగృహంలో శ్రావణ వరలక్ష్మీ వ్రతాన్ని అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించారు. ఇంట మహాలక్ష్మి ఆగమనంతో ఈ ఏడాది శ్రావణ వ్రతం ఆ కుటుంబానికి రెట్టింపు ఆనందాన్ని తెచ్చిపెట్టింది.

**తమ ఇంట మహాలక్ష్మి రాకతో వెల్లివిరిసిన ఆనందం**
కాపు కృష్ణ, కాపు సీతాలక్ష్మి దంపతుల ప్రథమ కుమారుడు జినీత్ – ఈశ్వరి దంపతులకు ఇటీవల పండంటి ఆడబిడ్డ జన్మించింది. ఆ చిన్నారిని ఆ కుటుంబం సాక్షాత్తు ఆ అష్టలక్ష్మి స్వరూపంగా, తమ ఇంటి మహాలక్ష్మిగా భావించారు. శ్రావణ మాసం మొదటి వరలక్ష్మీ వ్రతాన్ని ఆ చిన్నారి సమక్షంలో అత్యంత నిష్టతో ఆచరించాలని సంకల్పించారు.

మిగతా 2లో

# యువతను విస్మరిస్తే పతనం తప్పదు

- ○దిమాగి నక్సల్స్ ప్రకటన అసహనానికి నిదర్శనం అధ్యయనం పోరాటం అలవర్చుకోవాలి
- ○యువజన సమాఖ్య జిల్లా మహాసభలో కూనంనేని
- ○పోరాటాల కాణాచి యువజన సమాఖ్య ధర్మేంద్ర- వల్లీ




**చింతకాని, ఆగష్టు 21 (జనంసాక్షి)**
పాలకులు యువతను విస్మరిస్తే పతనం తప్పదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఉపాధి ఉద్యోగ రంగాలు పొట్టి పోతున్నాయని తద్వారా దేశంలో నిరుద్యోగం పెరిగిపోతుందని ఉపాధి లేక యువశక్తి నిర్వీర్యం అవుతుందని ఆయన తెలిపారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఖమ్మం జిల్లా 25వ మహాసభలు శుక్రవారం చింతకాని మండలం కొదుమూరు గ్రామంలో పగడాల భరత్ ప్రాంగణంలో జరిగింది. మహాసభకు ముందు గ్రామంలో వందలాది మంది యువకులు భారీ ప్రదర్శన నిర్వహించారు మహాసభ ప్రారంభ సూచికగా ఏఐవైఎఫ్ పతాకాన్ని కొండపర్తి గోవిందరావు అమరవీరుల స్థూపాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆవిష్కరించారు. మహమ్మద్ గౌస్ పాషా అబ్బూరి మహేష్ దండి శ్రీజ మామిడి కిరణ్ యమునా అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ యువజన సమాఖ్య కార్యకర్తలు సామాజిక కర్తవ్యాన్ని నెరవేర్చే క్రమంలో ముందు వరుసలో నిలబడాలని సూచించారు దేశ జనాభాలో సగం కలిగిన యువత హక్కుల కోసం పోరాడాలని పోరాడకుండా ఏ హక్కులు సాధించబడలేదన్నారు. సమాజాన్ని మార్చగలిగే శక్తి యువతరానికి ఉందని అందుకే చైతన్యవంతులైన ఈ తరాన్ని చూసి మోడీ భయపడుతున్నాడని సాంబశివరావు తెలిపారు మోడీ విధానాల కారణంగా యువత తీవ్ర అసహనానికి గురైందని అసహనం నుంచి ఆవేశం వచ్చిందని దీంతో మోడీ తలవంచక తప్పలేదని ఆయన తెలిపారు. యువతరం ముఖ్యంగా జెన్ జి వీధుల్లోకి పోరాట మార్గం ఎంచుకోవటంతో మోడీ అహంకారం పై తొలివేటు పడిందన్నారు అందుకే స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా,"" దిమాగి నక్సల్స్ " అన్న పదాన్ని తెరపైకి తెచ్చి ప్రశ్నించే వారిని దిమాగి నక్సల్స్ గా ముద్ర వేసి నిర్బంధించే ప్రయత్నం చేస్తుందని కూనంనేని తెలిపారు మావోయిస్టులను లేదా కమ్యూనిస్టులను భౌతికంగా హతమార్చిన భావజాలాన్ని మాత్రం అంతమందించడం ఎవరి తరం కాదన్నారు భావజాలాన్ని తుద ముట్టించేందుకు దిమాగి నక్సల్స్ పేరుతో నిర్బంధాలు హతమార్చడం లాంటి చర్యలకు

# నీళ్ల విషయంలో తెలంగాణ ప్రభుత్వం రైతు ద్రోహం చేస్తోంది

## - దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్



వార్తా లోపలి పేజీలో

# అర్హులైన ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు అందిచడమే లక్ష్యం.. బత్తుల

## శెట్టిపాలెంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**జనంసాక్షి, మిర్యాలగూడ :** అర్హులైన ప్రతి పేదవానికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం అని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం నాడు వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డ, ఖీఆూ రమణారెడ్డి, ఓఖీూ, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ..

మిగతా 3లో



# మాస్ లైన్ పార్టీని కాల్చడం తరం కాదు

## పోటు రంగారావు, కేజీ రామచందర్ ల విమర్శ

**ఖమ్మం కార్పొరేషన్ ఆగస్టు 21(జనంసాక్షి )** న్యూ డెమోక్రసీ పార్టీ విమల భుజాలపై తుపాకి పెట్టి మాస్ లైన్ పార్టీని కాల్చాలనుకోవడం వారి తరం కాదని మాస్ లేని పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తీవ్రంగా విమర్శించారు.రాయల చంద్రశేఖర్ మరణం మాస్ లైన్ పార్టీకి, విప్లవోద్యమానికి మాయని మచ్చగా, సమీక్షించి పుస్తకాల్లో కూడా రాశామనని అయన అన్నారు. సి పి ఐ ఎం ఎల్ మాస్ లైన్ ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల జనరల్ బాడీ సమావేశం శుక్రవారం ఖమ్మం లో రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో రెండు జిల్లాల కార్యదర్శులు ముద్దా బిక్షం, సివై పుల్లయ్యల అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కోటి రంగారావు హాజరై ప్రసంగిస్తూ, రాయల చంద్రశేఖర్ మరణించిన నాడు, అనంతర సంవత్సర కాలంలో జరిగిన సభ సందర్భంగా పూర్తిస్థాయిలో రివ్యూ చేసుకున్నామన్నారు. సంఘటనను లోకంగా కూడా భావిస్తున్నామన్నారు. ఇంకా ఏమైనా శాస్త్రీయ తప్పుదు ఇస్తే మేము సమీక్షించుకోవడానికి కూడా సిద్ధంగా ఉన్నామన్నారు. పుస్తక సభ సందర్భాలు కేంద్ర కమిటీ సభ్యులు వేములపల్లి వెంకట రామయ్య, పి ప్రసాద్, మధు లు విమలక్క భుజంపై పెట్టి మాస్ లైన్ పార్టీ ని తుపాకీతో కాల్చుతున్నాంన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక బద్ధ వ్యతిరేకతతో అనవసర, అసత్య, ఆరోపణలను చేస్తున్నారన్నారు. చంద్రశేఖర్ అన్న అంత్యక్రియలు ఎక్కడ చేయాలన్న సభ విషయం కానీ కనీసం విమలక్క చెప్పక పోవడం నేరమని అన్నారు. ఈ విషయమై సాక్ష్యధారాలతో సహా మాట్లాడింది, మధ్యలో ఎవరున్నారు అనే విషయం కూలంకషంగా వివరించారు. విమలక్కని అంత్యక్రియలు ఖమ్మంలో చేయాలని తర్వాత పిండిప్రోలులో చేయాలని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. సాంగ్స్ మరణ సభకు మూడు రకాలుగా బంధం వెళ్లి చెప్పిన చివరకు తను కూడా వెళ్లి చెప్పిన రాలేదన్నారు. కారణం పార్టీ నాయకులు కే రమ అధ్యక్షత ఉంటే తను రానని చెప్పడాన్ని ఏమనాలో ఆలోచించాలని కోరారు.




మఠాధిపతులు పీఠాధిపతులు అని తనను పి ప్రసాదు విమర్శించడానికి ఖండించారు. కమ్యూనిస్టు పార్టీలో అధిపతులు ఉండరని కమిటీలు బాధ్యతలు ఉంటాయని, విషయం తెలిసిన ఉద్దండులు వేములపల్లి వెంకట రామయ్య పి ప్రసాద్కి తెలియకపోవడము,కుట్ర పద్ధతిలో విమర్శించడాన్ని ఆలోచించాలన్నారు. వ్యక్తిగత విమర్శలను అస్త్రంగా మాట్లాడటం దారుణం అన్నారు. కారణం గుంటూరు కి వెళ్ళమంటే ఆరు నెలలు వెళ్లాను అన్నారు ఇల్లందు ప్రాంతానికి వెళ్ళమంటే రాయల సుభాష్ చంద్రబోస్ నివారించారని, రంగారావు పోలియో ఉండటం వలన నడవలేరనిచెప్పారని అన్నారు. కానీ ఈరోజు వీటికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని ఆయన అన్నారు. మా ఫ్రెండ్ పార్టీ రాష్ట్ర నాయకులు కేజీ రామచంద్ర మాట్లాడుతూ అమరుడు రాయల చంద్రశేఖర్ విషయంలో మాస్ లైన్ పార్టీ పూర్తి సమీక్షను చేస్తుందని చెప్పారు. పార్టీలో అసంతృప్తులు,విషయాలు చాలా ఉంటాయని గుర్తు చేశారు కానీ న్యూడెమోక్రసీ పార్టీ వాళ్లు రాయల చంద్రశేఖరకు వి ప్రభాకర్కు జరిగిన కోన్ సంభాషణకు జవాబు చెప్పాలని కోరుతున్నారన్నారు. ఫోన్ సంభాషణలో ఉన్న విషయాలను పరిశీలిస్తే కమ్యూనిస్టు పార్టీ చైతన్యంతో ఆలోచించకుండా వ్యతిరేకతతో మాత్రమే శ్రీ ప్రసాదు వేములపల్లి వెంకటరామయ్య మధులు ఆరోపిస్తున్నారని గుర్తు చేశారు ఫోన్ సంభాషణలో తనను లెక్క చేయటం లేదని, తనకు కారులేదని, మా బాధ్యులు అనుకుంటున్నాను ఆఫీసు గది నుండి తన సామానులు బయట పారేశారని చంద్రశేఖర్ మాట్లాడటం వాస్తవానికి తన కార్యక్షేత్రమైన ఇల్లందును వదిలి ఖమ్మంలో ఉండటాన్ని క్షేత్రాన్ని వదిలివేయడానికి పార్టీ గుర్తు చేస్తున్నదని అన్నారు. పూర్తిస్థాయిలో పనిచేస్తే తనకు ఏ సమస్య ఉండేది కాదని, చంద్రశేఖర్ పనిచేయకుండా ఉండటం వల్ల ఈ సమస్యలన్నీ ఎదుర్కొన్నాడన్నారు. కారు తీసుకోవటానికి ఇల్లందు ప్రాంతానికి పార్టీ అనుమతి ఇచ్చిందని గుర్తు చేశారు. ఆర్థిక వనరుల సేకరణ కూడా నాయకుడి బాధ్యతే నన్నారు.ఇలా విశ్లేషించకుండా న్యూడెమోక్రసీ పార్టీ ఆరోపణలను చేయడాన్ని ఖండించారు. ఈజనరల్ బాడీ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ దర్శి వర్గ సభ్యులు కే రమ, కేచ్చేల రంగయ్య, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య చిన్న చంద్రన్న, వి ప్రభాకర్, కే సూర్యం, ఎం హన్మే ష్,ఎం కృష్ణ,ఎస్ ఎల్ పద్మ చంద్ర అరుణ, గడ్డం సదానందం గుర్రం అచ్చయ్య, కె కల్పన, ఆవుల వెంకటేశ్వరరావు,రామయ్య,ఆవుల అశోక్ పాల్గొని ప్రసంగించారు.

# యువతను విస్మరిస్తే పతనం తప్పదు

పాల్పడే ప్రమాదం ఉందని ఆయన తెలిపారు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన మోడీ ఉన్న ఉద్యోగాలను ఊడగొడుతున్నారని మోడీ కేవలం అంబానీ అదా నీ కోసం ప్రధానిగా పనిచేస్తున్నారని కూనంనేని ఆరోపించారు ప్రపంచవ్యాప్తంగా వామపక్ష భావజాలం పెరుగుతుందని పెట్టుబడిదారీ దేశం అమెరికాలో ట్రంప్ కు వ్యతిరేకంగా సోషలిస్టులు వరుస విజయాలు సాధిస్తున్నారని న్యూయార్క్ మేయర్ ను సోషలిస్టు భావజాలం ఉన్న వ్యక్తి గెలుచుకున్నారన్నారు సమాజచోదక శక్తి యువతేనని మారిన మారుతున్న పరిణామాలు నిరంతరం అధ్యయనం చేస్తూ పోరాట తత్వాన్ని అలవర్చుకోవాలి యువత సైతాంతిక నైతిక శారీరక బలాన్ని పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. పోరాటాల కాణాచి ఏఐవైఎఫ్ వలీ- ధర్మేంద్ర భారతదేశ యువజనోద్యమాలకు దిక్సూచి ఏఐవైఎఫ్ అని పోరాటాల కాణాచిగా పేరుగాంచిందని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వలివుల్లా ఖాద్రి, కల్లూరి ధర్మేంద్ర తెలిపారు యువజన సమాఖ్య మహాసభలో వారు మాట్లాడుతూ పాలకులు యువతకు సంబంధించిన ఏ పథకాలను అమలు చేయడం లేదని ఆరోపించారు యువతకు ఉపాధి ఉద్యోగాల కోసం ఏఐవైఎఫ్ పోరాడుతుందని వారు తెలిపారు ఉద్యోగ ఉపాధి కల్పనకు సంబంధించి పాలకులు కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు బయ్యారం ఉక్కు పరిశ్రమ సాధన కోసం పోరాడుతామని వలి ధర్మేంద్ర తెలిపారు ఈ మహాసభల్లో సిపిఐ జాతీయ సమితి సభ్యుల భాగం హేమంతరావు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి , కొండపర్తి గోవిందరావు నానబాల రామకృష్ణ తదితరులు ప్రసంగించగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, షేక్ జానీ మియా ఏపూరిలతాదేవి బిజె క్లెమెంట్ పలువురు జిల్లా కార్యవర్గ సభ్యులు పావులూరి మల్లికార్జునరావు కూచిపూడి రవి ఆహ్వాన సంఘం అధ్యక్షులు కొల్లి శ్రీనివాసరావు ప్రధాన కార్యదర్శి దూసరి గోపాలరావు, ఏఐఎస్ఎఫ్ నాయకులు రామకృష్ణ లక్ష్మణ్, ఏఐవైఎఫ్ నాయకులు శ్రీనాథ్ రెడ్డి శ్రావణ్, చింతల రమేష్, కొల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెంలో ఘనంగా శ్రావణ వరలక్ష్మీ వ్రతం

## మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి గృహంలో ఆధ్యాత్మిక శోభ!

### భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రత ఆచరణ

శుక్రవారం రోజున గృహంలో ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో వరలక్ష్మీ దంపతుల ప్రతిమలను ఉంచి, శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు చేపట్టారు. వేదమంత్రోచ్ఛారణలు, భక్తి గీతాల నడుమ కాపు సీతాలక్ష్మి దంపతులు అమ్మవారికి నిష్టగా నోము నోచారు. నూతనంగా జన్మించిన తమ ఇంటి మహాలక్ష్మి (మనుమరాలు)ని ఒడిలో ఉంచుకుని జినీత్ – ఈశ్వరి దంపతులు భక్తితో ప్రార్థనలు చేశారు. ఇల్లంతా ధూప దీప నైవేద్యాలతో, సుగంధ ద్రవ్యాల పరిమళాలతో దివ్యంగా మారింది.

### ముత్తైదువుల ఆశీస్సులు - వైభవంగా వాయినాలదానం

ఈ పవిత్ర వేడుకకు స్థానిక ముత్తైదువులను (సువాసినులను) సాదరంగా ఆహ్వానించారు. పూజా అనంతరం ముత్తైదువులందరూ చిన్నారిని ముద్దాడి, దీర్ఘమాయుష్షుతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని మనసారా ఆశీర్వదించారు. ఈ సందర్భంగా శ్రీమతి కాపు సీతాలక్ష్మి స్వయంగా ముత్తైదువులను గౌరవించి, పసుపు కుంకుమలు, జాకెట్టు ముక్కలు, ఫలసాయంతో కూడిన తాంబూలాలను (వాయినాలు) భక్తిపూర్వకంగా అందజేశారు. సమాజంలో ప్రతి ఒక్కరి కుటుంబం సుఖసంతోషాలతో, సిరిసంపదలతో తులతూగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు ఆమె తెలిపారు. బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ ఆధ్యాత్మిక వేడుకను విజయవంతం చేశారు.

## రూపా రెడ్డి హత్య కేసును ఛేదించిన పోలీసులకు

# కృతజ్ఞతలు తెలిపిన పాఠశాల యాజమాన్యం

**నల్లగొండ,ఆగస్టు 21,(జనంసాక్షి):** కొండమల్లేపల్లి నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపల్ కల్లు రూపా రెడ్డి హత్య కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి, నిందితులను గుర్తించి కేసును ఛేదించిన నల్లగొండ జిల్లా పోలీసులకు పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు, కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ మేరకు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్‌ను కలిసి పోలీసు అధికారులు, దర్యాప్తు బృందం రాత్రింబవళ్లు శ్రమించి కేసును త్వరితగతిన ఛేదించిన తీరును అభినందించారు. ఘటనతో భయాందోళనకు గురైన తమకు పోలీసుల సమర్థవంతమైన దర్యాప్తు భరోసా, నమ్మకాన్ని కలిగించిందని తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ.. కేసులో చట్టపరమైన ప్రక్రియను వేగవంతం చేసి, దర్యాప్తును పూర్తిచేసి న్యాయస్థానంలో త్వరితగతిన చార్జ్‌షీట్ దాఖలు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా పోలీసు శాఖ అన్ని విధాలుగా కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.ప్రజల భద్రత, నేర నియంత్రణకు పోలీసు శాఖ నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తుందని ఎస్పీ తెలిపారు. ప్రతి కాలనీతో పాటు ఇళ్ల పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. నేరాల నియంత్రణలో ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు.





## గుర్రంపోడు మండల సర్పంచుల

# ఫోరం అధ్యక్షుడిగా గంగుల కృష్ణ

**గుర్రంపోడు, ఆగస్టు 21, (జనంసాక్షి)** గుర్రంపోడు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు గంగుల కృష్ణ ఎన్నికయ్యారు. శుక్రవారం మండల కేంద్రంలోని (ఆర్ అండ్ బి) అతిథి గృహంలో నాగార్జునసాగర్ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) జయవీర్ రెడ్డి సమక్షంలో ఒక ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గంగుల కృష్ణను మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులుగా అధికారికంగా ప్రకటించారు.అనంతరం ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి మాట్లాడుతూ.. సర్పంచుల ఫోరం అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన గంగుల కృష్ణకు అభినందనలు తెలిపారు. మండలంలోని గ్రామాలను ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్లడానికి, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సర్పంచుల సమస్యల పరిష్కారానికి మరియు గ్రామాల బలోపేతానికి తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.అనంతరం నూతనంగా ఎన్నికైన సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గంగుల కృష్ణ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా తిరిగి అవకాశం కల్పించిన ఎమ్మెల్యే జయవీర్ రెడ్డికి, మండలంలోని సర్పంచులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అందరినీ కలుపుకుంటూ మండలంలోని అన్ని గ్రామాల సమస్యల పరిష్కారానికి, గ్రామాల సమగ్ర అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, జిల్లా నాయకులు మండల నాయకులు, సర్పంచులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# గిరిజన విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి: మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు

## పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి: గిరిజన విద్యార్థి సంఘం

**జనంసాక్షి,మిర్యాలగూడ:**
గిరిజన విద్యార్థుల విద్యా సమస్యలను పరిష్కరించడంతో పాటు ఎస్టీ, ఎస్సీ, బీసీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు అన్నారు. శుక్రవారం నాడు గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ఒక రోజు నిరాహార దీక్ష చేపట్టారు ఈ దీక్షకు ఆయన మద్దతు తెలపడం జరిగింది .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు పెండింగ్‌లో ఉండటంతో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక ఇబ్బందులతో కొందరు విద్యార్థులు చదువును కొనసాగించలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. పెండింగ్ నిధులను తక్షణమే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి కోటియా నాయక్ మాట్లాడుతూ ఖాళీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయడంతో పాటు విద్యార్థుల హాస్టళ్లను మెరుగుపరచాలని, అవసరమైన చోట కొత్త భవనాలు నిర్మించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి నాణ్యమైన విద్య అందించాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజుల వసూళ్లను అరికట్టాలని డిమాండ్ చేశారు.గిరిజన విద్యార్థులకు ఉన్నత విద్యలో మరిన్ని అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టకపోతే రాష్ట్రవ్యాప్తంగా గిరిజన విద్యార్థులను సమీకరించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షకు గిరిజన విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు ఇందల్ రాథోడ్, జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు వెంకట్ బంజారా, జాతీయ ప్రధాన కార్యదర్శి మూడ్ బాలాజీ నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు లావూరి రవీందర్ నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిదా నాయక్ పాల్గొన్నారు.



# అర్హులైన ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు అందిచడమే లక్ష్యం.. బత్తుల

## శెట్టిపాలెంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులతో ప్రజా పంపిణీ వ్యవస్థ మరింత పారదర్శకంగా, సులభతరంగా మారుతుందని తెలిపారు.అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది, లబ్ధిదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# తాగు నీటి సమస్యకు పరిష్కారం ముద్దసాని కిరణ్ రెడ్డి



**వలిగొండ, ఆగస్టు 21( జనం సాక్షి )**
మండలంలోని మొగిలిపాక గ్రామంలోని ఎస్సీ కాలనీలో ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్‌ను శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ముద్దసాని కిరణ్‌రెడ్డి ప్రారంభించారు. తన సొంత నిధులతో ఫిల్టర్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని కాలనీ ప్రజలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జడిగే బుచ్చయ్య, ఉపసర్పంచ్ షేక్ సైదులు, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, గ్రామ పెద్దలు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# పట్టణ కాంగ్రెస్,ఎస్సీ సెల్, మైనార్టీ సెల్,యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ ,సంఘాల కమిటీ నియామకం

**ఆత్మకూరు(ఎం) జనంసాక్షి ఆగస్టు (21)**
శుక్రవారం రోజు ఆత్మకూరు పట్టణ కాంగ్రెస్ అనుబంధ సంఘాలకు నూతన కమిటీలను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కందడి అనంతరెడ్డి, మరియు కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు యువజన కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ నాయకుల సమక్షంలో ,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతరబోయిన భాస్కర్ అధ్యక్షతన నూతన కమిటిలను నియమించడం జరిగింది. నూతన యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా యాస మురళి రెడ్డి, ఎన్ ఎస్ యు ఐ పట్టణ అధ్యక్షుని గా పైళ్ళ మహేష్, ఎస్సీ సెల్ అధ్యక్షునిగా గట్టు రాజు,మైనార్టీ సెల్ అధ్యక్షునిగా ఎండీ జహంగీర్ లను నియమించడం జరిగింది. నూతనంగా నియమించిన అధ్యక్షులు మరియు వారి కార్యవర్గాలు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని తెలిపారు.





# మదీనా మసీద్ నూతన కమిటీ ఎన్నిక

**మునగాల, ఆగస్టు 21(జనంసాక్షి):**
మండల పరిధిలోని బరాఖత్ గూడెం గ్రామంలో శుక్రవారం ముస్లిం మైనార్టీలకు సంబంధించిన మదీనా మసీద్ కమిటీని గ్రామ ముస్లిం పెద్దలు సమక్షంలో ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారునిగా షేక్ లాల్ మొహమ్మద్, కమిటీ అధ్యక్షునిగా షేక్ రఫీ, ఉపాధ్యక్షుడిగా జానీ పాషాలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ అధ్యక్షులు షేక్ రఫీ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో కమిటీ అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు గ్రామ ముస్లిం సహోదరులకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా మసీదు అభివృద్ధికి అందరి సహాయ సహకారాలతో తన వంతు కృషి చేస్తానని అన్నారు. అనంతరం మైనార్టీ నాయకులు నూతనంగా ఎన్నికైన కమిటీకి శుభాకాంక్షలు తెలుపుతూ వారికి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, ముస్లిం సహోదరులు పాల్గొన్నారు.

# సీతానగరంలో ఘనంగా వనమాసం పండుగ

**మునగాల, ఆగస్టు 21(జనంసాక్షి):**
మండల పరిధిలోని సీతానగరం గ్రామంలో శ్రీ కనకదుర్గమ్మ తల్లి వనమాసం పండుగను గ్రామస్తులు, ఆడపడుచులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడపడుచులు సంప్రదాయ దుస్తులు ధరించి గంపలు ఎత్తుకొని, అమ్మవారి నామస్మరణ చేస్తూ ఊరేగింపుగా తరలివచ్చారు. గ్రామంలో డప్పు చప్పుళ్లు, సావులతో పండుగ వాతావరణం నెలకొంది. గొర్రెపోతులతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ కనకదుర్గమ్మ తల్లికి గంపలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. వనమాసం పండుగ సందర్భంగా సీతానగరం గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొనగా, ఆడపడుచులు ఉత్సాహంగా పాల్గొని సంప్రదాయాలను కొనసాగించారు.



# ప్రమాణానికి రావాలి.. మాట మీద నిలబడాలి

- ఆరోపణలు నిజమైతే నిరూపించాలి..
- లేదంటే బహిరంగంగా క్షమాపణ చెప్పాలి: మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు
- నేడు ఉదయం 9 గంటలకు శిర్ధపల్లి రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రమాణానికి రావాలని సవాల్..

**చండూరు, ఆగస్టు 21 (జనంసాక్షి)**
చండూరు మున్సిపాలిటీలో అవినీతి, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారంటూ మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి చేసిన ఆరోపణలను మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు ఖండించారు. ఆరోపణలు నిజమని నిరూపిస్తే తాను పదవికి రాజీనామా చేస్తానని, తాను డబ్బులు తీసుకోలేదని ప్రమాణం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ మేరకు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి తన మాట మీద నిలబడి ఈ రోజు ఉదయం 9 గంటలకు శిర్ధపల్లి రోడ్డులోని ఆంజనేయస్వామి దేవాలయానికి వచ్చి ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు.గత సోమవారం ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో చండూరు చౌరస్తా వద్ద కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో బస్సు షెల్టర్ నిర్మాణం పేరుతో పండ్ల వ్యాపారులను బెదిరించి రూ.12 లక్షలు వసూలు చేశారని ఆరోపించినట్లు చైర్మన్ తెలిపారు. వైన్‌షాపులు, పండ్ల దుకాణాలు, ఆస్పత్రులు, కాంట్రాక్టర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు తదితరుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలు అబద్ధమైతే గుడి వద్ద ప్రమాణం చేస్తానని ప్రభాకర్‌రెడ్డి చెప్పినట్లు తెలిపారు.దీనికి ప్రతిస్పందనగా మంగళవారం చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు వ్యాపారులను తీసుకుని విలేకరుల సమావేశం నిర్వహించారు. తాను గానీ, తన పాలకవర్గ సభ్యులు గానీ ఎవరి వద్దనైనా ఒక్క రూపాయి లంచం తీసుకున్నట్లు లేదా అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తానని




ప్రకటించారు. ప్రస్తుతం చేసిన సవాల్‌లో భాగంగా తాను డబ్బులు తీసుకోలేదని ప్రమాణం చేస్తానని, తనపై ఆరోపణలు చేసిన వ్యక్తి తాను డబ్బులు తీసుకున్నానని ప్రమాణం చేయాలని అన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యాపారులు సైతం తాను గానీ, కౌన్సిలర్లు గానీ తమ వద్ద నుంచి ఒక్క రూపాయి తీసుకోలేదని ప్రమాణం చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి తప్పనిసరిగా తన మాట మీద నిలబడి ప్రమాణానికి వస్తారని వేయికళ్లతో ఎదురు చూస్తున్నామని కోడి శ్రీనివాసులు అన్నారు. ఒకవేళ ప్రమాణానికి రాకపోతే మునుగోడు నియోజకవర్గ ప్రజలు ఆయనను, ఆయన మాటలను నమ్మరని పేర్కొన్నారు. ఆరోపణలను వెనక్కి తీసుకుని ప్రజలకు, మున్సిపల్ పాలకవర్గానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# నీళ్ల విషయంలో తెలంగాణ ప్రభుత్వం రైతు ద్రోహం చేస్తోంది

## - దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్

**పి.ఏ.పల్లి,ఆగస్టు 21 (జనంసాక్షి):** నీళ్ల విషయంలో తెలంగాణ ప్రభుత్వం రైతులకు ద్రోహం,మోసం చేస్తోందని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ఆరోపించారు.శుక్రవారం పి.ఏ.పల్లి మండలం గణపురం స్టేజ్ సమీపంలోని ఏఎంఆర్పీ మెయిన్ కెనాల్ డిస్ట్రిబ్యూటర్ మెయిన్ గేట్ల వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

– నాగార్జున సాగర్ కు చుక్క నీరు రాకుండా పోతిరెడ్డిపాడుకు 25 వేల క్యూసెక్కుల నీళ్లు తరలిస్తున్నారు.సాగర్ నిండేంత వరకు పోతిరెడ్డిపాడు నీళ్లు తీసుకెళ్లడానికి వీల్లేదు.

– ఎవరి ఆదేశాలతో పోతిరెడ్డిపాడు నుంచి నీళు తరలిస్తున్నారో ప్రభుత్వం చెప్పాలి.

– ఎగువ నుంచి కృష్ణాకు నీరు వస్తున్నా రైతులకు ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది.

– కేసీఆర్ హయంలో నాగార్జున సాగర్ ఎడమ కాలువ కింద బ్రహ్మాండంగా రైతులకు రెండు పంటలకు నీళ్లు ఇచ్చాం. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇప్పుడు కూడా రెండు పంటలకు నీళ్లు ఇవ్వొచ్చు.

– చంద్రబాబు నాయుడు కోసమే కాళేశ్వరం ప్రాజెక్టును రేవంత్ రెడ్డి ఎండబెట్టారని, తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని విమర్శించారు.

– స్థానిక ఎమ్మెల్యేకు నల్లమట్టి మీద ఉన్న ప్రేమ రైతుల మీద లేదు. నల్గొండకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నీళ్లు తీసుకెళ్తుంటే స్థానిక ఎమ్మెల్యేకు సోయి లేదు.

**ఏఎంఆర్పీ నీటితో చెరువులు నింపాలి:**

గుడిపల్లి, పీఏ పల్లి మండలాల రైతులు భూగర్భ జలాలపైనే ఆధారపడి సాగు చేస్తున్నారని, చెరువులు, కుంటలు ఎండిపోవడంతో భూగర్భ జలాలు పడిపోయి తాగు, సాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.నల్లగొండ పట్టణానికి తాగునీరు తరలించడంతో పాటు ముందుగా ఏఎంఆర్పీ నీటితో స్థానికంగా ఉన్న చెరువులు, కుంటలను నింపాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం వెంటనే స్పందించి నాగార్జున సాగర్ ఎడమ కాలువ కింద రైతులకు సాగునీరు, ఏఎంఆర్పీ పరిధిలో చెరువులు, కుంటలకు నీరు విడుదల చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యా నాయక్,మండల అధ్యక్షులు యెల్గురి వల్లపు రెడ్డి,సీనియర్ నాయకులు కటికనేని మాధవరావు,తోటకూరి పరమేష్,మాద సుధాకర్ గౌడ్,సర్పంచులు కూన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి,రాయనబోయిన శ్రీను,నగేష్,రమావత్ కిషన్, అర్వపల్లి నర్సింహ,బొడ్డుపల్లి మహేందర్,దీపావత్ నరేందర్,ఎర్ర యాదగిరి,మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు,స్థానికులు పాల్గొన్నారు.



ప్రతి పేదవాని సొంతయింటి కలను

# నెరవేర్చడమే ప్రభుత్వ ధ్యేయం

## ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**జనంసాక్షి, మిర్యాలగూడ :** ఇందిరమ్మ ఇండ్ల ద్వారా ప్రతి పేదవాని సొంత ఇంటి కలను సాకారం చెయ్యడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం అని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు.శుక్రవారం నాడు వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిర్మాణం పూర్తిచేసుకున్న లబ్ధిదారుల నూతన గృహప్రవేశ కార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ,ఆర్డీవో రమణారెడ్డి పాల్గొన్నారు. నూతన గృహాలకు రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులను నూతన ఇళ్లలోకి సాదరంగా ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. సొంతింటిలోకి అడుగుపెట్టిన లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియడం సంతోషకరమని పేర్కొన్నారు.కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# మండల కేంద్రంలో ఘనంగా హర్ష టయోటా గ్రామీణ మహోత్సవం

## ప్రారంభించిన స్థానిక సర్పంచ్, స్థానిక ఎస్ఐ




ఆత్మకూరు (ఎం) జనం సాక్షి ఆగస్టు (21) మండల కేంద్రంలో హర్ష టయోటా ఆధ్వర్యంలో గ్రామీణ మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది. ఆత్మకూరు మండల కేంద్రంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ఎదురుగా శుక్రవారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ఆత్మకూరు (ఎం) సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ మరియు ఆత్మకూర్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎన్. లక్ష్మీనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముఖ్య అతిథులు రిబ్బన్ కట్ చేసి, దీపజ్యోతి వెలిగించి గ్రామీణ మహోత్సవాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా హర్ష టయోటా ఆధ్వర్యంలో కొత్త కార్ల కొనుగోలు, ఎక్స్ఛేంజ్ వాల్యుయేషన్, యూజ్డ్ కార్లు, ఫైనాన్స్ సదుపాయాలు వంటి ప్రత్యేక సేవలు అందుబాటులో ఉంటాయి.ఈ గ్రామీణ మహోత్సవం మరో రెండు రోజుల పాటు ఆత్మకూరు (ఎం) మండల కేంద్రంలో కొనసాగనుంది. కావున ఆత్మకూరు మండలంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరూ ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హర్ష టయోటా నిర్వాహకులు కోరారు.

## బొమ్మకల్లు సమీపంలో

# మిషన్ భగీరథ నీళ్లు వృథా

**తాగునీటికి ప్రజల ఇబ్బందులు - పట్టించుకోని అధికారులు**

**మాడుగులపల్లి, ఆగస్టు 21 ( జనం సాక్షి):** మాడుగులపల్లి మండలం బొమ్మకల్లు గ్రామం నుండి కుక్కడం వెళ్లే మార్గంలో, బొమ్మకల్లు రెవెన్యూ పరిధిలో మిషన్ భగీరథ ద్వారా వస్తున్న తాగునీటిని పొలాలకు మళ్లించి తడిపివేస్తున్న దృశ్యాలు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి ?ఒకవైపు అనేక ప్రాంతాల్లో పౌరులు తాగడానికి గుక్కెడు నీళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు అత్యంత విలువైన తాగునీరు పొలాల పాలు కావడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు భగీరథ నీటిని అనధికారికంగా వ్యవసాయ అవసరాలకు ఉపయోగిస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.



# రైతులపై దాష్టీకం తిప్పర్తి

## సహకార సంఘం నిర్వాహకుల చేతివాటం




- ❑ఆన్‌లైన్ బుకింగ్, రశీదులు ఉన్నా దక్కని యూరియా
- ❑ప్రశ్నించిన అన్నదాతలపై భౌతిక దాడులకు యత్నం!
- ❑జనం సాక్షి విలేకరి రాకతో తోక ముడిచిన సిబ్బంది హుటాహుటిన యూరియా పంపిణీ
- ❑మాడుగులపల్లి కేంద్రంలో నిలువుదోపిడీ అధికారుల నిర్లక్ష్యంపై ఉగ్రరూపం దాల్చిన రైతాంగం

**మాడుగులపల్లి, ఆగస్టు 21 (జనం సాక్షి):** నమ్మిన సహకార సంఘమే నట్టేట ముంచుతోంది. కంటికి రెప్పలా కాపాడాల్సిన అధికారులే కాలయముళ్లలా మారుతున్నారు మాడుగులపల్లి మండల కేంద్రంలో తిప్పర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఏసిఎస్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూరియా పంపిణీ కేంద్రం అక్రమాలకు, అధికారుల నిరంకుశత్వానికి నిలయంగా మారింది నిబంధనల ప్రకారం ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుని, రూపాయి రూపాయి కూడబెట్టి డబ్బులు చెల్లించి రశీదులు పొందిన రైతులకు తీవ్ర నిరాశే మిగులుతోంది గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి రశీదులు చూపిస్తున్నా, సిబ్బంది మాత్రం యూరియా ఇవ్వకుండా తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నారు అసలు ఎరువుల నిల్వలు ఎటు మళ్లిస్తున్నారు? ఎవరి జేబులు నింపుతున్నారు? అని నిలదీస్తే సమాధానం చెప్పకపోగా రైతులపై దౌర్జన్యానికి దిగుతున్నారు

**చేయి చేసుకునేంత తెగింపా?**

గురువారం ఎరువుల పంపిణీ వద్ద సహకార సంఘం సిబ్బంది తీరు హద్దులు దాటింది తమ హక్కుగా రావాల్సిన యూరియా ఇవ్వాలని గట్టిగా అడిగిన అన్నదాతలపై నిర్వాహకులు బూతులతో విరుచుకుపడటమే కాకుండా, ఏకంగా చేయి చేసుకునేందుకు ప్రయత్నించడం కలకలం రేపింది ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే సంస్థల్లోనే అధికారులకు ఇంత తెగింపు ఉంటే, ఇక ప్రైవేటు వ్యాపారులను అదుపు చేసేదెవరని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు

**కెమెరా చూడగానే దిగొచ్చిన నిర్వాహకులు**

సహకార సంఘం సిబ్బంది దౌర్జన్యం, గొడవ జరుగుతున్న సమాచారం అందుకున్న వెంటనే జనం సాక్షి విలేకరి సంఘటనా స్థలానికి చేరుకున్నారు విలేకరి ప్రత్యక్షంగా రంగంలోకి దిగి పరిస్థితిని గమనించడం, కెమెరా ముందు నిజాలు బయటపడతాయనే భయంతో నిర్వాహకులు ఒక్కసారిగా తోక ముడిచారు ఇప్పటివరకు రైతులకు సమాధానం చెప్పకుండా వేధించిన అధికారులు, జనం సాక్షి ప్రతినిధి చూడగానే దిగివచ్చి లైన్లలో వేచి ఉన్న రైతులకు హుటాహుటిన యూరియా పంపిణీ ప్రారంభించారు జనం సాక్షి చొరవతోనే తమకు న్యాయం జరిగిందని, యూరియా దక్కిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు

**ఉన్నతాధికారులు నిద్రపోతున్నారా?**

మీడియా వస్తే తప్ప పంపిణీ చేయని పరిస్థితి ఉందంటే అక్రమాలు ఎంత స్థాయిలో జరుగుతున్నాయో అర్థమవుతోందని రైతులు మండిపడుతున్నారు. రైతుల పట్ల అత్యంత బాధ్యతారాహిత్యంగా, దురుసుగా ప్రవర్తిస్తూ భౌతిక దాడులకు దిగిన తిప్పర్తి సహకార సంఘం సిబ్బందిపై తక్షణమే శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండల రైతాంగం డిమాండ్ చేస్తోంది లేనిపక్షంలో కలెక్టరేట్ ముట్టడితో పాటు పెద్ద ఎత్తున ఆందోళన బాట పడతామని హెచ్చరిస్తున్నారు.




## ఉపాధ్యాయుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలి

### ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్యకు నిరసనగా భారీ ర్యాలీ నిర్వహించిన ప్రైవేట్ స్కూల్ మేనేజ్మెంట్స్, టీచర్స్

సూర్యాపేట(జనంసాక్షి):
నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో నాగార్జున పాఠశాల ప్రిన్సిపాల్ రూపారెడ్డి దారుణ హత్యకు గురికావడం తీవ్రగ్భ్రాంతికరమని యునైటెడ్ ట్రస్మా, తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫెడరేషన్, తెలంగాణ ప్రైవేట్ ఉపాధ్యాయ సంఘం నాయకులు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆ సంఘాల ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత గురువుకు మన సంస్కృతిలో అత్యున్నత స్థానం ఉందన్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువును మందలించిందనే కారణంతో హత్య చేయడం దారుణమన్నారు. భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే ఉపాధ్యాయులకు రక్షణ లేకపోవడం ఆందోళన కలిగించే విషయమన్నారు. ప్రైవేట్ ఉపాధ్యాయుల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చట్టం, చర్యలు తీసుకోవాలని అన్నారు. దేశంలో ఎన్ని వృత్తులు ఉన్నా, అన్ని వృత్తులకు రూపకల్పన చేసేది ఉపాధ్యాయ వృత్తి ఒక్కటేనని తెలిపారు. దేశ భవిష్యత్తు కోసం యువతరాన్ని, నవతరాన్ని తీర్చిదిద్దుతూ ఉపాధ్యాయులు నిరంతరం శ్రమిస్తున్నారని, సమాజ నిర్మాణంలో వారి పాత్రను ప్రతి ఒక్కరూ గుర్తించి గౌరవించాలని కోరారు. ఉపాధ్యాయులు విద్యార్థుల మంచి కోసమే సూచనలు, మందలింపులు చేస్తారని, వాటిని సానుకూలంగా అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, ఆ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయ విజ్ఞాన సదస్సులో చట్టాలపై అవగాహన

కొండ మల్లేపల్లి , ఆగస్టు 21 (జనంసాక్షి):



దేవరకొండ కోర్టు ఆవరణలో మండల న్యాయ సేవాధికార సంస్థ, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్పర్సన్ కే.అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.వి.ఎస్. హరీష్ బాబు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి స్నేహ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ కక్షిదారులు తమ కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించుకునే దిశగా ముందుకు సాగాలని సూచించారు. ఇరువర్గాలు పరస్పరం చర్చించుకొని రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకోవడం ద్వారా సమయం, ధనం ఆదా చేసుకోవడంతో పాటు సమాజంలో సఖ్యతను పెంపొందించుకోవచ్చని తెలిపారు. అలాగే యువత గంజాయి వంటి మాదకద్రవ్యాలకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. మైనర్ వివాహాలను అరికట్టడంతో పాటు శిశువిక్రయాలు వంటి అమానవీయ ఘటనలు జరగకుండా సమాజంలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా అనేక సామాజిక సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు సన్నాయిల ఉమామహేశ్వర్, సెక్రటరీ వనం జగదీశ్వర్, సీనియర్ న్యాయవాదులు గాజుల ఆంజనేయులు, మహమ్మద్ షౌకత్ అలీ, ఇదం రవికుమార్, శ్రీకాంత్, కృష్ణ, గణేష్, ఇదయ్య, శంకర్ తదితర న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసు అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు పేరు తో మహిళ పై అత్యాచారం

ఆత్మకూర్ (ఎం) జనం సాక్షి ఆగస్టు (21)



మండలం లో ని పుల్లాయి గూడెం గ్రామాని కి చెందిన మహిళ కు ఇందిరమ్మ ఇల్లు ఇపిస్తాను అని చెప్పి ఆ మహిళ కు ఆశ చూపి, ఇందిరమ్మ ఇల్లు లిస్ట్ లో మీ పేరు వచ్చింది అని చెప్పి ఆ తర్వాత సిమెంట్ బస్తాలు ఇపిస్తాను అని చెప్పి గ్రామ శాఖ అధ్యక్షుడు మౌళి శంకర్ రెడ్డి ఆ మహిళ పై పలు మార్లు అత్యాచారం చేసాడు. ఈ విషయం పై పోలీస్ స్టేషన్ లో కేసు పెట్టవద్దు అని గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో పంచాయితీ పెట్టి అర ఎకరం భూమి ఇస్తాను అని చెప్పాడు. ఆ మహిళ ఆమె భర్త వినకపోవడం తో ఆ మహిళ ను ఆమె భర్త ను పలు మార్లు భయభ్రాంతులకు గురి చేశాడు. ఈ విషయం పై శుక్రవారం రోజున స్థానిక పోలీస్ స్టేషన్ లో బాధితురాలు ఆమె భర్త ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తామని ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

**అధికార మహంతో ఏదైనా చేయొచ్చా**

కాంగ్రెస్ పార్టీ అధికారం లో అధికార పార్టీ కి సంబంధించిన నాయకులు అధికారం వుంది అని ఏదైనా చేయొచ్చా అని మహిళ సంఘాల లీడర్లు అంటున్నారు. చాలా రోజుల నుంచి పుల్లాయిగూడెం గ్రామంలో చాలా మంది మహిళలు కు మీకు ఇందిరమ్మ ఇల్లు వచ్చింది. అని ఆశ చూపుతున్నాడని అన్నారు.

# రేపే ప్రభుత్వానికి డెడ్ లైన్

- లేకుంటే 19 వేల మంది ఆర్టిజన్ ఉద్యోగులతో పులిచింతలలో భారీ ధర్నా
- ఉద్యోగుల ఆరోగ్యంతో చెలగాటం ఆపాలి: రాష్ట్ర జేఏసీ చైర్మన్ సతీష్‌రెడ్డి
- కాంట్రాక్ట్ కార్మికులను తొలగించే ప్రయత్నాలను అడ్డుకుంటాం





చింతలపాలెం(జనంసాక్షి)
పులిచింతల జెన్‌కోలో ఆన్‌ఫర్ ఆర్టిజన్ కాంట్రాక్ట్ ఉద్యోగులు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష తొమ్మిదో రోజుకు చేరిన నేపథ్యంలో రాష్ట్ర ఆర్టిజన్ ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం, జెన్‌కో యాజమాన్యం రేపు సాయంత్రంలోగా స్పందించి సమస్యను పరిష్కరించకపోతే 'చలో పులిచింతల' కు పిలుపునిచ్చి భారీ ధర్నా నిర్వహిస్తా మని రాష్ట్ర ఆర్టిజన్ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ సతీష్‌రెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 ఏళ్లుగా జెన్‌కోకు సేవలందిస్తున్న కాంట్రాక్ట్ ఆర్టిజన్ ఉద్యోగులను తొలగించే ప్రయత్నం చేయడం సరికాద న్నారు. ఉద్యోగులు తొమ్మిది రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం ఆవేదనకరమన్నారు. దీక్ష చేస్తున్న కార్మికుల ఆరోగ్యం క్షీణిస్తున్న నేపథ్యం లో ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

**బీపీ, షుగర్ స్థాయిలు తగ్గుతున్నాయి**

ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న ముగ్గురు కాంట్రాక్ట్ ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఎంఎల్‌హెచ్‌పీ వినయ్ తెలిపారు. పరీక్షల్లో బీపీ,షుగర్ స్థాయిలు భారీగా తగ్గుతున్నట్లు గుర్తించామని,దీక్ష కొనసాగుతున్న నేపథ్యంలో వాళ్ల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని చెప్పారు.

**19 వేల మంది ఉద్యోగులతో పులిచింతల ముట్టడి**

ప్రభుత్వం స్పందించని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జెన్‌కో (ఉఐజిఅా), ట్రాన్స్‌కో ,ఎస్పీడీసీఎల్ , ఎన్‌పీడీసీఎల్ (ఔఖఆఅఒ) పరిధిలోని సుమారు 19 వేల మంది ఆర్టిజన్ ఎంప్లాయిస్‌తో పులిచింతలలో భారీ ధర్నా నిర్వహిస్తామని సతీష్‌రెడ్డి ప్రకటించారు. కార్మికుల సమస్యను ప్రభుత్వం చులకనగా చూడొద్దని, సమస్యను పరిష్కరించే వరకు జేఏసీ ఆధ్వర్యంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. పులిచింతల ప్రాజెక్టు జెన్‌కో ఎస్ఈ పై కూడా జేఏసీ నాయకులు ఆరోపణలు చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను విధుల నుంచి తొలగించేందుకు వివిధ ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ,కార్మికుల ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించడం సరికాద న్నారు. ఉద్యోగుల పట్ల అన్యాయంగా వ్యవహరిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన లను విస్తరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెన్‌కో రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణారెడ్డి,రాష్ట్ర ఆర్టిజన్ ఎంప్లాయిస్ కార్యదర్శి సింగిరెడ్డి చంద్రారెడ్డి,ఎస్పీడీసీఎల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కనకరాజు తో పాటు రాష్ట్ర జేఏసీ నాయకులు పాల్గొని కాంట్రాక్ట్ ఉద్యోగుల దీక్షకు సంపూర్ణ మద్దతు తెలిపారు.

# డ్రగ్స్ కట్టడిలో ప్రతిభ..

## సీఐ వెంకటేశ్వర్లుకు గుడ్ వర్క్ రివార్డు

మోత్కూరు ఆగస్టు 21 (జనం సాక్షి)




డ్రగ్స్ నియంత్రణ, అక్రమ రవాణా నిరోధంలో సమర్థవంతంగా విధులు నిర్వహించిన మోత్కూరు పోలీస్‌స్టేషన్ సీఐ వెంకటేశ్వర్లును ఉన్నతాధికారులు ప్రశంసించారు. పెద్దమారూర్ గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు పోలీసు శాఖలో అంకితభావంతో విధులు నిర్వహిస్తూ తన స్వగ్రామానికి మంచి పేరు తీసుకొస్తున్నారు.
డ్రగ్స్ కట్టడిలో ఆయన కనబరిచిన ఉత్తమ పనితీరును గుర్తిస్తూ హైదరాబాద్ యాంటీ డ్రగ్స్ విభాగం ఇన్‌చార్జి అడిషనల్ డీజీపీ సందీప్ శాండిల్య చేతుల మీదుగా గుడ్ వర్క్ రివార్డును అందుకున్నారు. డ్రగ్స్ అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతూ సమర్థవంతంగా పనిచేసినందుకు ఈ ప్రత్యేక గుర్తింపు లభించింది. రివార్డు అందుకున్న సీఐ వెంకటేశ్వర్లును ఉన్నతాధికారులు, సహచర పోలీసు అధికారులు అభినందించారు. ఆయనకు పెద్దమారూర్ గ్రామస్థులు కూడా అభినందనలు తెలిపారు.

## ఛలో హైదరాబాద్ బహిరంగ సభను విజయవంతం చేయాలి

సూర్యాపేట (జనంసాక్షి):
కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికలలో మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారం సీపీఎస్ రద్దు హామీ ని నిలబెట్టుకోవాలని కోరుతూ టీఎస్‌సీపీఎస్ఈయు ఆధ్వర్యంలో లక్ష మంది సీపీఎస్ ఉద్యోగులతో ఈ నెల 23న హైదరాబాద్ లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించే ఛలో హైదరాబాద్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షులు లక్కపాక ప్రవీణ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాపేట జిల్లాలోని సీపీఎస్ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



## సంతోషిమాత దేవాలయంలో ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు

సూర్యాపేట (జనంసాక్షి):
శ్రావణమాసం రెండవ శుక్రవారం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని సంతోషిమాత దేవాలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రధాన అర్చకులు ఇరువంటి శివరామకృష్ణ శర్మ అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. భక్తులు సమర్పించిన పట్టు వస్త్రాలను అమ్మవారికి అలంకరించి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో గల శ్రీచక్రంకు ప్రత్యేక పూజలు,సంతోషిమాత ఉద్యాపన వ్రతం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక ఊయలలో పవళింపు సేవా కార్యక్రమం, సాయంత్రం వైభవలక్ష్మి వ్రతము నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ గౌరవ అధ్యక్షులు నూక వెంకటేశం గుప్త,అధ్యక్షులు బ్రహ్మాండ్లపల్లి మురళీధర్ ప్రధాన కార్యదర్శి పబ్బా ప్రకాశరావు, కోశాధికారి కొత్త మల్లికార్జున్ ,నరేంద్రుని విద్యాసాగర్ రావు,సోమ శ్రీశైలం, బెలిదె అశోక్,తాళ్లపల్లి రామయ్య, బ్రహ్మాండ్లపల్లి బాలచంద్రుడు, ముదిరెడ్డి లింగారెడ్డి, బ్రాహ్మణపల్లి శివప్రసాద్, దేవరశెట్టి సోమయ్య, వందనపు వెంకటేశ్వర్లు, నూకా రవిశంకర్, దేవాలయ అర్చకులు బట్టార వంశీకృష్ణ శర్మ,అశోక్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరా లో అంతరాయం

వలిగొండ , ఆగస్టు 21 (జనం సాక్షి )
మండలంలోని అరూర్ లొ అరూర్ సబ్ స్టేషన్ లొ అరూర్, వెల్వర్తి, పులిగిల్ల ఫీడర్ మరమ్మత్తుల కారణంగాఅరూర్, వెల్వర్తి, పులిగిల్ల, గురనాథపల్లి,జంగారెడ్డిపల్లి,అప్పారెడ్డి పల్లె, నర్సాయిగూడెం, కాంచనపల్లి గ్రామాలకు నేడు మధ్యాహ్నం 12 గంటల నుండి, 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ వినియోగదారులు రైతులు సహకరించాలని విద్యుత్ ఏ ఈ నర్సింహా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# ఇల్లు కిరాయికంటూ వచ్చి మహిళ మెడలో బంగారం అపహరణ

**మాడుగులపల్లి ఆగష్టు 21 (జనం సాక్షి):**
మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం దొంగలు హల్‌చల్ చేశారు ఇల్లు కిరాయికి ఉందా అని ఆరా తీస్తూ వచ్చి, మహిళ మెడలోని బంగారు గొలుసును తెంపుకెళ్లిన ఘటన స్థానికంగా భయాందోళనలు సృష్టించింది బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మాడుగులపల్లి మండల కేంద్రంలో సాయంత్రం 5:00 నుండి 6:00 గంటల మధ్య సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంటి వద్దకు వచ్చారు ఇక్కడ ఇల్లు కిరాయికి ఉందా? అని అడుగుతూ మాటల్లో దించారు మాటల్లో పెట్టి అదను చూసి, మహిళ మెడలో ఉన్న దాదాపు 3 తులాల బంగారు గొలుసును తెంపుకొని క్షణాల్లో అక్కడి నుండి పరారయ్యారు ఈ ఘటనపై సమాచారం అందుకున్న స్థానిక సీఐ, ఎస్ఐలు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తూ దర్యాప్తు వేగవంతం చేశారు జనసంచారం ఉండే సాయంత్రం వేళలోనే ఇలాంటి దోపిడీ జరగడంతో ప్రజలు తీవ్రగ్భ్రాంతికి గురయ్యారు.





## అంగీకరించిన అంశాలను వెంటనే అమలు చేయాలి

● ఈ నెల 25న అన్ని డిపోల వద్ద నిరాహార దీక్షలు

● ఎస్ డబ్ల్యూఎఫ్ రీజియన్ కార్యదర్శి బత్తుల సుధాకర్

**సూర్యాపేట(జనంసాక్షి):**
ఆర్టీసీ కార్మిక సంఘాలతో యాజమాన్యం జరిపిన చర్చల్లో అంగీకరించిన అంశాలను వెంటనే అమలు చేయాలని కోరుతూ ఈ నెల 25న అన్ని ఆర్టీసి డిపోల వద్ద స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే నిరాహార దీక్షలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రీజియన్ కార్యదర్శి బత్తుల సుధాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని టీజీఎస్ ఆర్టీసీ డిపో వద్ద దీక్షలు జయప్రదంకై కార్మికులతో కలిసి కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. చర్చల సందర్భంగా అనేక అంశాలను అంగీకరించారని అన్నారు. కార్మిక సంఘాలతో చర్చించి డిపో రీజియన్ స్థాయిలో పని భారాలు చర్చించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. సమస్యలు లేని విలీనం, సంపూర్ణ ఉద్యోగ భద్రతకై కొట్లాడాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. బ్రెడ్ విన్నర్ స్కీం కార్మికులను రెగ్యులర్ చేస్తామన్న యాజమాన్యం నేటికీ జీవో విడుదల చేయలేదన్నారు. జూనియర్ అసిస్టెంట్ పరీక్ష పాసైన కార్మికులకు నేటికీ పోస్టింగులు ఇవ్వకపోవడం సరికాదన్నారు. అంగీకరించిన అంశాలను నేటికీ అమలు చేయకపోవడం వల్ల కార్మికులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్డ్ కార్మికులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని అన్నారు. హయ్యర్ పెన్షన్ సమస్యను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాచర్ల భాస్కర్, విప్లవ రెడ్డి, ఇంద్రయ్య, సైదులు, జిఏం రావు, అంజద్ నాయక్, నాగేశ్వర్, వెంకన్న , గౌతమి, దంతేశ్వరి, సరిత, మౌనిక, శృతి, మమత, స్వరూప తదితరులు పాల్గొన్నారు.




# ఉపాధ్యాయుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

## ప్రిన్సిపాల్ రూపా రెడ్డి హత్యను ఖండిస్తూ ప్రైవేటు ఉపాధ్యాయుల ర్యాలీ

**చిట్యాల, ఆగష్టు 21 (జనం సాక్షి):**
నల్లగొండ జిల్లా మల్లేపల్లి మండల కేంద్రంలోని నాగార్జున గ్రామర్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీమతి రూపా రెడ్డి దారుణ హత్యను తీవ్రంగా ఖండిస్తూ చిట్యాల పట్టణంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం(ట్రస్మా) ఆధ్వర్యంలో శుక్రవారం రోజున నిరసన ర్యాలీ నిర్వహించారు. విద్యా రంగంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్స్, పాఠశాల యాజమాన్యాలకు భద్రత కల్పించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ పాఠశాలల ప్రతినిధులు పోలీస్, మున్సిపల్ అధికారులకు ఈ సందర్భంగా మెమోరాండం సమర్పించారు.
రూపా రెడ్డి దారుణ హత్యను మండలంలోని పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యా రంగానికి చెందిన ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండిస్తున్నట్లు మెమోరాండంలో పేర్కొన్నారు.
విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతూ, వారి భవిష్యత్తును తీర్చిదిద్దే పవిత్రమైన వృత్తిలో ఉన్న ఉపాధ్యాయులపై ఇలాంటి దాడులు జరగడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, ఇతర సిబ్బందికి భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.
ఈ సందర్భంగా ప్రధానంగా ఐదు డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. ప్రిన్సిపాల్ రూపా రెడ్డి కుటుంబానికి పాల్పడిన నిందితులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని, ప్రైవేట్ మరియు ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, సిబ్బందికి తగిన భద్రతా చర్యలు కల్పించాలని కోరారు. పాఠశాలల వద్ద భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు, పాఠశాల యాజమాన్యాలు, ఉపాధ్యాయులపై బెదిరింపులు లేదా దాడులు జరిగితే వెంటనే ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.
అదేవిధంగా ఉపాధ్యాయుల భద్రతకు సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని, “ఉపాధ్యాయుల భద్రత విద్యా వ్యవస్థకు భద్రత” అనే భావనతో ఈ అంశంపై ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా మండల శాఖ అధ్యక్షులు ఎండి జమీరుద్దీన్, నాయకులు గట్టు అలెగ్జాండర్ రెడ్డి, పెద్ది నరేందర్, ప్రకాష్, జె వేణుగోపాల్ రెడ్డి, బొడిగె విజయ్, బొడిగె రవి, పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

## జీవో 97ను తక్షణమే ఉపసంహరించాలి

### ఆవుల సంపత్




**నల్లగొండ,ఆగస్టు 22,(జనం సాక్షి):**
రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 97 ద్వారా పాలిటెక్నిక్ కళాశాలలను నైపుణ్య విశ్వవిద్యాలయ పరిధిలోకి తీసుకురావాలనే నిర్ణయాన్ని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తీవ్రంగా ఖండిస్తోందని రాష్ట్ర నాయకులు ఆవుల సంపత్ అన్నారు. దశాబ్దాలుగా పేద, మధ్యతరగతి విద్యార్థులకు సాంకేతిక విద్యను అందిస్తున్న పాలిటెక్నిక్ వ్యవస్థ స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలు సాంకేతిక విద్యా శాఖ, రాష్ట్ర సాంకేతిక విద్య మరియు శిక్షణ మండలి ఆధ్వర్యంలోనే కొనసాగించాలని కోరారు. మూడేళ్ల డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరంలో నేరుగా ప్రవేశం పొందే అవకాశం కొనసాగుతుందా లేదా అనే అంశంపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని, విద్యార్థుల నేరుగా ప్రవేశ హక్కుకు ఎలాంటి భంగం కలగకుండా హామీ ఇవ్వాలని అన్నారు. అలాగే ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను ప్రైవేటీకరించే ప్రయత్నాలను నిలిపివేయాలని, పేద విద్యార్థులపై అదనపు ఫీజుల భారం మోపవద్దని డిమాండ్ చేశారు. జీవో 97పై ప్రభుత్వం తక్షణమే పునరాలోచించకపోతే, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ కళాశాలల్లో ఆందోళనలు, ధర్నాలు చేపడతామని ఆవుల సంపత్ హెచ్చరించారు.

## శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

**రామన్నపేట, ఆగస్టు 21 (జనంసాక్షి):**
రామన్నపేట పట్టణ కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో శ్రావణమాసం శుక్రవారం, వరలక్ష్మి వ్రతాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు శ్రీలక్ష్మి సమేత చెన్నకేశవ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి ఎం. శ్రీనివాసచార్యులు శ్రీదేవి భక్తులచే అమ్మవారికి కుంకుమ పూజ, సామూహిక వ్రతాలను భక్తిశ్రద్ధలతో జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లవణం ఉపేందర్, కమిటీ సభ్యులు కొత్త మాస మధు, దొంత యాదగిరి, బ్రహ్మాచారి, మద్దెగల్ల నరసింహ, మల్లేశ్, లవణం జానకి, మామిళ్ళ కవిత, కేతమ్మ, మంజుల, భోగి కార్ విజయలక్ష్మి, గోగి కార్ పుణ్యావతి, లవణం సరిత, ఇంద్రమ్మ, సులోచన, కీర్తి, భవిష్య, పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.





## పెండింగ్ ప్రాజెక్టుల సాధనకై సీపీఎం కదనభేరి

**29, 30 తేదీల్లో భువనగిరి నుంచి హైదరాబాద్‌కు పాదయాత్ర**

**31న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా.. కరపత్రాల ఆవిష్కరణ**

**మోటకొండూరు, ఆగష్టు 21(జనం సాక్షి):**
జిల్లాలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టనున్న పాదయాత్ర, మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బొలగాని జయరాములు, మండల కార్యదర్శి కొల్లూరి ఆంజనేయులు పిలుపునిచ్చారు. శుక్రవారం మోటకొండూరులో వారు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జిల్లా ఏర్పడి పదేళ్లయినా ప్రాజెక్టుల విషయంలో పురోగతి లేకపోవడం పాలకుల నిర్లక్ష్యమేనన్నారు. బునాదిగాని కాలువతో పాటు బస్వాపూర్, గంధమల్ల, చర్లగూడెం పనులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. నవాబుపేట రిజర్వాయర్ కాలువలు 15 ఏళ్లుగా చుక్క నీరు రాక శిథిలావస్థకు చేరుకున్నాయని మండిపడ్డారు. ఈ ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టులకు నిధులు విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 29, 30 తేదీల్లో భువనగిరి నుంచి హైదరాబాద్ వరకు నిర్వహించే పాదయాత్రలో, 31న ఇందిరాపార్క్ వద్ద జరిగే మహాధర్నాలో ప్రజలు, రైతులు భారీ సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వడ్డేబోయిన మహేందర్, కొల్లూరి సుధాకర్, సాయిలు, నగేష్, ఉపేందర్ చారి తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 24న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

**తుంగతుర్తి ఆగస్టు 21 (జనం సాక్షి)**
ఈ నెల 24న తుంగతుర్తి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి చలపతి తెలిపారు, శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ సమావేశం ఈ సమావేశం మధ్యాహ్నం ఒంటిగంటకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు, ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా స్థానిక శాసనసభ్యులు మందుల సామేలు హాజరవుతున్నట్లు తెలిపారు ఈ సమావేశానికి గ్రామ సర్పంచులు మండల స్థాయి అధికారులు పంచాయతీ కార్యదర్శులు సకాలంలో హాజరు కావాలని కోరారు

# నిర్లక్ష్యం వహిస్తున్న ఉపాధ్యాయులపై చర్యలేవి?

○డీఈవో, ఎంఈవోలు చర్యలు తీసుకోకపోవడం వెనుక మూడుపుల మాయాజాలమా?

○విద్యార్థుల తల్లిదండ్రుల ఆరోపణ

**భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 21 (జనంసాక్షి):** పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత, జడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాల ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు నరసింహారావు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 3న ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు నాలుగోసారి ఫిర్యాదు చేయగా, స్పందించిన కలెక్టర్ అదే రోజు డీఈవోతో సంబంధిత పాఠశాలల్లో తనిఖీ చేయించారు. అయితే ఫిర్యాదు చేసి 20 రోజులు గడిచినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తల్లిదండ్రులు ఆరోపించారు. గతంలోనూ పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోకపోవడం వెనుక "మూడుపుల మాయాజాలం" ఉందేమోనని తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేశారు. డీఈవో, ఎంఈవోలు నిర్లక్ష్యం వహిస్తున్న ఉపాధ్యాయులకు ఎందుకు మద్దతు ఇస్తున్నారని వారు ప్రశ్నించారు.



జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా స్పందించి సంబంధిత ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుని విద్యార్థులకు న్యాయం చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

# కాంగ్రెస్‌లో అనుచిత వ్యాఖ్యలపై కఠిన చర్యలు తీసుకోవాలి

## సుమంత్ దుద్దుకూరి



**ఖమ్మం, (జనంసాక్షి) :** తెలంగాణ మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ పార్టీపై కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు సుమంత్ దుద్దుకూరి తీవ్రంగా ఖండించారు. పార్టీని, ప్రభుత్వాన్ని, నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుని బహిరంగంగా చేసే అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ సహించకూడదని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్నాయని, వాటిపై పీసీసీ, ఏఐసీసీ తక్షణ చర్యలు తీసుకోవాలని సుమంత్ డిమాండ్ చేశారు. బహిరంగ సభల్లోనూ, మీడియా ముందునూ ప్రభుత్వం లేదా పార్టీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసే వారిపై కఠిన క్రమశిక్షణ చర్యలు తప్పనిసరి అని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వెంటనే క్షమాపణ చెప్పాలని ఆయన కోరారు. కుటుంబ నేపథ్యాన్ని, నాయకత్వాన్ని, పార్టీని ఇబ్బంది పెట్టేలా మాట్లాడటం సరికాదని వ్యాఖ్యానించారు. అవసరమైతే సమస్యలను పార్టీ అంతర్గత వేదికలపై చర్చించుకోవాలని, కానీ బహిరంగంగా అపోహలు, ఆరోపణలు చేయడం తగదని హితవు పలికారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం వెనుక లక్షలాది కార్యకర్తలు, ప్రజలు, ఉద్యమ నాయకుల కృషి ఉందని సుమంత్ గుర్తుచేశారు. పార్టీ, ప్రభుత్వం, కార్యకర్తలు కలిసి వచ్చినప్పుడే ఇది సాధ్యమైందని చెప్పారు. అందుకే నాయకత్వంపై అనుచిత వ్యాఖ్యలు ఎవరు చేసినా అందరూ ఏకమై ఖండించాలని, పార్టీ ఐక్యతను కాపాడుకోవాలని ఆయన కోరారు. పార్టీ నాయకత్వం బలహీనమైంది కాదని, పరిస్థితులను ఓపికతో ఎదుర్కొంటూ సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకుంటోందని సుమంత్ అన్నారు. ఇకపై కాంగ్రెస్ కుటుంబ సభ్యులు పార్టీ, ప్రభుత్వం, ముఖ్యమంత్రి విషయంలో మాట్లాడేటప్పుడు మరింత బాధ్యతతో వ్యవహరించాలని ఆయన సూచించారు.

## సంఘబంధం భవనం నిర్మాణ పనులకు శంకుస్థాపన



మండలంలోని రామన్నగూడెంలో గ్రామ మహిళా సమాఖ్య (సంఘబంధం) భవనం నిర్మాణ పనులకు శుక్రవారం గ్రామ సర్పంచ్ కర్నాటి వెంకన్న శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకన్న మాట్లాడుతూ విబీజీరామ్ పథకం ద్వారా విడుదల చేసిన 10 లక్షల రూపాయల వ్యయంతో ఈ భవన నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ భవన నిర్మాణం కోసం స్థలాన్ని అనిరెడ్డి లక్మికాంతరెడ్డి విరాళంగా అందజేశారని తెలిపారు. ఈ సందర్భంగా స్థలదాత లక్ష్మికాంతరెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఏఈ కుమారస్వామి, ఉపసర్పంచ్ లింగంపల్లి రవిందర్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, సంఘబంధం అధ్యక్షురాలు రేఖల రాణి, నాయకులు అనిరెడ్డి లక్మికాంతరెడ్డి, రేఖల సైదులు, కర్నాటి మురళి, ఎండీ హమీద్, పొట్టెపాక సైదులు, శేఖర్, కారింగుల నాగరాజు, రామక్రిష్ణ, నరేష్, నవీన్, వార్డు సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



కొమ్మాల గ్రామంలో శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించబడినది. ఈ కార్యక్రమానికి గ్రామములోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వ్రతం అనంతరము తీర్థ ప్రసాదములు స్వీకరించడం జరిగినది.



## పంట పొలాలను పరిశీలించిన పరిశోధన శాస్త్రవేత్తలు

**చింతలపాలెం(జనంసాక్షి)**

సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని పంట పొలాలను వ్యవసాయ పరిశోధన స్థానం,కంపాసా గర్ మరియు తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం,హుజూర్‌నగర్ శాస్త్రవేత్తలు సందర్శించి రైతులకు ప్రస్తుతం అనుసరించాల్సిన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మిరప పంటలో నేల ద్వారా సంక్రమించే వ్యాధులు రాకుండా ట్రైకోడెర్మా అనే జీవ శిలీంధ్ర నాశినిని సేంద్రియ ఎరువులో కలిపి వేయాలని సూచించారు.కాండం కుళ్లు వ్యాధి ఉన్న చోట ఒక లీటరు నీటికి 2 గ్రాముల డైమెథోమార్ఫ్ కలిపి పిచికారీ చేయాల ని సూచించారు.పత్తి పంటలో దీపపు పురుగులను నివారించేందుకు ఎకరాకు 80 గ్రాముల ఫ్లోనికామిడ్‌ను పిచికారీ చేయాలని సూచించారు.పత్తి పంటపై పూత దశలో డిఏపి మరియు ఇతర కాంప్లెక్స్ ఎరువులను అధికంగా వాడకూడదని రైతులకు తెలియజేశా రు.ఈ కార్యక్రమంలో డాక్టర్ పరిమళ సీనియర్ శాస్త్రవేత్త,డాక్టర్ చంద్రశేఖర్ శాస్త్రవేత్త, భవన్,భవాని వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

## ప్రిన్సిపల్ రూప రెడ్డికి ఘన నివాళులు

# నిందితులను కఠినంగా శిక్షించాలి

**బిస్మార్ట్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జలంధర్ రెడ్డి డిమాండ్**

**భువనగిరి,ఆగష్టు 21(జనంసాక్షి ప్రతినిధి)**

బడ్జెట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ పగిడాల జలంధర్ రెడ్డి ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలోని విజ్ఞాన్ ఐఐటి ప్రాంగణంలో ఇటీవల దుర్మార్గుల చేతిలో హత్యకు గురైన నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపల్ రూపా రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రిన్సిపల్ రూపా రెడ్డిని అతి దారుణంగా హత్య చేయడంను నిరసిస్తూ నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సభ్య సమాజం తలదించుకోనేలా ఇలాంటి సంఘటన జరగడం చాలా బాధాకరమని అన్నారు. ఇలాంటి సంఘటనలు జరగడంతో ఉపాధ్యాయులు భయానికి లోనవుతున్నారు. అందువలన ఉపాధ్యాయులకు రక్షణ కల్పించేలా ప్రత్యేకమైన చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బి స్మార్ట్ యాదాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బసవరెడ్డి,కోశాధికారి ప్రభాకర్ రెడ్డి, రవి కుమార్,మల్లేశం గౌడ్, రమేష్, శ్రీనివాస్ రావు, శ్రీనివాస్,జార్జ్,జోసెఫ్, విద్యా సాగర్, అరుణకుమారి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రైతులపై యూరియా రవాణా చార్జీల పేరా దోపిడీని అరికట్టండి

**- సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ గ్రామ కార్యదర్శి దరావత్ రవి**



**మునగాల, ఆగష్టు 21(జనంసాక్షి):** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు పై భారాన్ని రోజురోజుకు పెంచటం విచారకరమని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కొక్కిరేణి గ్రామ కార్యదర్శి దరావత్ రవి శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఇప్పటికే కాంప్లెక్స్ ఎరువుల పేర అధిక ధరలు పెంచి రైతుల నడివీడుస్తున్న పరిస్థితి ఉన్నది. ఇది చాలదన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం యూరియా రవాణా ఖర్చులు కూడా రైతులే భరించాలని చెప్పటం సరైంది కాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు, ప్రజలకు అండదండగా ఉంటామని చెప్పుకుంటూ ప్రజాపాలనని ప్రగల్బాలు చెప్పుకుంటూ నేడు రైతులపై రవాణా చార్జీల పేరు భారం మోపటం దేనికి నిదర్శనం ప్రశ్నించారు. వెంటనే రైతులపై మోపుతున్న రవాణా చార్జింగ్ ప్రభుత్వ వివరించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.



దేవరకొండ పట్టణంలోని రామ్ రామ్ బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తీజ్ వేడుకలకు ఉత్సవ కమిటీ సభ్యుకు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్ 30 వేల రూపాయలు విరాళం ప్రకటించారు. వారివెంట ఉత్సవ కమిటీ సభ్యులు రమావత్ వంశీ, నేనావత్ జాను, కొర్ర శ్రీధర్, ప్రకాష్, మాకట్లాల్, కిరణ్ తదితరులు ఉన్నారు.

**జనంసాక్షి, కొండమల్లేపల్లి**

## గుర్రంపోడు రూపురేఖలు మార్చేలా అభివృద్ధి పనులు

## సుందరీకరణ పనులపై ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి సమీక్ష

**గుర్రంపోడు: ఆగస్టు 21 (జనంసాక్షి)**

నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని గుర్రంపోడు మండల కేంద్రం సుందరీకరణ పనులపై శుక్రవారం ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. మండల కేంద్ర అభివృద్ధికి చేపడుతున్న వివిధ పనుల పురోగతిని అధికారులు,ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే సమీక్షించారు.ఈ సందర్భంగా భవనాలు, రహదారుల శాఖ (ఆర్‌అండ్‌బీ) విశ్రాంతి భవనం ఆధునీకరణ, మండల కేంద్రంలోని మురుగునీటి కాల్వల వ్యవస్థ మెరుగుదల, రోడ్ల విస్తరణ, నూతన రహదారుల నిర్మాణ పనుల పురోగతిపై సమగ్రంగా చర్చించారు. పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.అనంతరం మండల కేంద్రంలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న రహదారి విస్తరణ పనులను ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. గుర్రంపోడు మండల కేంద్రాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు త్వరలోనే అధునాతన కూడలి (జంక్షన్) ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.రోడ్ల విస్తరణ, జంక్షన్ ఏర్పాటు, మురుగునీటి కాల్వల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి గుర్రంపోడును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.గంగుల కృష్ణకు సర్పంచ్‌ల ఫోరం అధ్యక్ష బాధ్యతలు, అనంతరం నిర్వహించిన సమావేశంలో గుర్రంపోడు మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా గంగుల కృష్ణను అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, సర్పంచ్‌లు ఆయనకు అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో స్థానిక రహదారులు, భవనాల శాఖ డీఈ, మండల రెవెన్యూ అధికారి (ఎమ్మార్వో), మండల అధ్యక్షుడు, జిల్లా నాయకులు, సర్పంచ్‌లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## రూపా రెడ్డి హత్య ఘటనను ఖండిస్తూ సెంచరీ టెక్నో స్కూల్లో ఉపాధ్యాయుల నిరసన

కల్లూరు ఆగస్టు 21(జనంసాక్షి)

పాఠశాల ప్రిన్సిపాల్ రూపా రెడ్డి హత్యకు పాల్పడిన పదవ తరగతి విద్యార్థుల చర్యను ఖండిస్తూ సెంచరీ టెక్నో స్కూల్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, పాఠశాల , పాఠశాల నిర్వాక యాజమాన్యం వారు నల్ల బ్యాడ్జీలు ధరించి శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులు మాట్లాడారు. విద్యార్థుల్లో మానవత్వం, విలువలు, క్రమశిక్షణ, అహింస, పరస్పర గౌరవం వంటి సద్గుణాలను పెంపొందించాల్సిన అవసరం ఉందని వెల్లడించారు.హింసకు ఎలాంటి స్థానం లేదని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**"హింసకు దూరంగా ఉండాలి - మానవత్వ విలువలను కాపాడాలి"**

అనే సందేశాన్ని విద్యార్థులకు అందిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెంచరీ టెక్నో స్కూల్ యాజమాన్యం ఏగుపాటి కృష్ణారావు పాఠశాల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దేవాలయ అష్టమ వార్షిక పవిత్రోత్సవాలు

ఖమ్మం కార్పొరేషన్ ఆగస్టు 21 (జనంసాక్షి )



ఖమ్మం పట్టణ బ్రాహ్మణ బజార్లో ఉన్న ఉన్న, అతి ప్రాచీన చరిత్ర కలిగిన శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి దేవాలయ అష్టమ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేయబడ్డాయి. ఈనెల 27వ తేదీ గురువారం నుండి, 29వ తేదీ శనివారం వరకు, పవిత్ర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆగమ పండితులు, శ్రీమాన్ బుర్ర వాసుదేవచార్యులు బృందం వారిచే యజ్ఞ, హోమ కార్యక్రమాలు, విశేష పూజలు నిర్వహించనున్నారు. మహా శాంతి హోమం, అష్టోత్తర కలశ స్థాపన, నవగ్రహమకం, కళ్యాణం, అభిషేకం కార్యక్రమాలు పవిత్రంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ పవిత్ర కార్యక్రమాలలో భక్తులు విశేషంగా పాల్గొని, స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఆలయ చైర్మన్ రాయపూడి అనంత పద్మనాభం, కావ్య నిర్వహణ అధికారి కే. జగన్ మోహన్ రావు, సరోజనమ్మ, కమిటీ సభ్యులు కోరారు. ప్రతినిత్యం స్వామి సేవ చేస్తున్న ఆలయ అర్చకులు, వి శశి కుమార్, వి శ్రీనివాసచార్యులు స్వామి వారి పవిత్ర కార్యక్రమాలలో భక్తులు పాల్గొని, స్వామి కృపకు పాత్రులు కాగలరని, తీర్థ ప్రసాదాలు స్వీకరించవలసిందిగా కోరారు.

## చంద్రుగొండ పంచాయతీలో దోమల మందు, ఫాగ్ స్ప్రే చేయాలి

చంద్రుగొండ, ఆగస్టు 21 (జనంసాక్షి):



చంద్రుగొండ గ్రామపంచాయతీ పరిధిలో దోమల నివారణకు వెంటనే దోమల మందు, ఫాగ్ స్ప్రే చేయించాలని కోరుతూ గ్రామస్థులు పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాయి రాజా మాట్లాడుతూ.. గ్రామంలో అడపాదడపా కురుస్తున్న వర్షాలతో భూమి చిత్తడిగా మారడంతో దోమల సంఖ్య విపరీతంగా పెరిగిందన్నారు. దోమల కారణంగా విష జ్వరాలు వ్యాపించే అవకాశం ఉన్నందున ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పంచాయతీ అధికారులు వెంటనే దోమల మందు పిచికారీ చేయడంతో పాటు ఫాగ్ స్ప్రే చేయించాలని కోరారు.సమస్యను వెంటనే పరిష్కరించకపోతే పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ మహిళలు నందమూరి నాగమ్మ, కుంపటి లక్ష్మి, అమ్మునిషా తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌జీటీయూ మండల శాఖ అధ్యక్షుడిగా బోయ శ్రీనివాసులు

భూదాన్‌పోచంపల్లి,ఆగష్టు21(జనంసాక్షి)



ఎస్‌జీటీయూ మండల శాఖ సమావేశాన్ని జిల్లా ఉపాధ్యక్షులు కె. రవి ఆధ్వర్యంలో గురువారం భూదాన్ పోచంపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడిగా బోయ శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా బాల బాబు, ప్రధాన కార్యదర్శిగా కె. శ్రీధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు.



## 24 న జేఏసీ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్రవ్యాప్త ఆటోల బంద్ ను జయప్రదం చేయండి

కల్లూరు ఆగస్టు 21(జనంసాక్షి)

ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 24వ తేదీ న జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త ఆటోల బందును జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విటల్ రావు ఆటో డ్రైవర్లు, యజమానులకు పిలుపునిచ్చారు. శుక్రవారం కల్లూరు మధిర రోడ్డులో ఆటోల బంద్ కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులు కోమటి గోపాలరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్రావు మాట్లాడుతూఆటో రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆటో కార్మికులకు సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగాఆర్టీసీ యాజమాన్యానికి ఎలక్ట్రికల్ ఆటోలు ఇవ్వాలనే ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలని అన్నారు .. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ అధ్యక్షులు తన్నీరు కృష్ణారావు , ఆటో యూనియన్ నాయకులు కత్తి నాగేశ్వరరావు కోలా కృష్ణయ్య ఎ.రాజేషు ఎం కృష్ణతదితరులు పాల్గొన్నారు.

## స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ స్కూల్ శ్రీనగర్‌లో వరలక్ష్మి వ్రతం వేడుకలు

ఖమ్మం, (జనంసాక్షి) :



క్షీరసాగరంలో పుట్టి, వైకుంఠాన మెట్టి, అమృతకరశాబ్ది నుండి అనంతకోటి చంద్రకాంతులతో అవతరించిన దేవి శ్రీమహాలక్ష్మీ. అమ్మవారిని ఈ శ్రావణమాసంలో రెండవ శుక్రవారం నాడు వరలక్ష్మీ వ్రతంగా పూజించుకుంటాం. ఈ వ్రత వేడుకను స్థానిక శ్రీనగర్ కాలనీలోని స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ స్కూల్‌లో అత్యంత భక్తి శ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో పుణ్యవ్రతాన్ని ఆచరించారు. అమ్మవారి అనురాగాన్ని, అను గ్రహాన్ని విద్యార్థినులకు అందించుట కోసం పాఠశాలలో నిర్వహిం చామని తెలిపి, అందరికి శుభాకాంక్షలు తెలియజేసారు. పాఠశాల డైరెక్టర్ కొండా క్రిష్ణవేణి గారు పూజలో పాల్గొని, విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయల విలువలను తెలపడానికి, ముఖ్యంగా స్త్రీలకు మాత్రమే పరిమితమైన వరలక్ష్మీ వ్రతంలాంటి వేడుకలను విద్యార్థులకు ఆచరించి చూపుటకు ఇలాంటి పండుగలను నిర్వహించినట్లు తెలిపి, అందరికి వరలక్ష్మీ వ్రత పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.సురేష్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేసారు.

## ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా శివలింగం నియామకం

మోటకొండూరు, ఆగస్టు 21(జనం సాక్షి):



జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా మోటకొండూరు మండల కేంద్రానికి చెందిన సురుపంగ శివలింగం నియమితుల య్యారు. ఈ సందర్భంగా శివలింగం మాట్లాడుతూ.. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం పకడ్బందీగా అమలయ్యేలా తన వంతు కృషి చేస్తానన్నారు. బాధితులకు, సాక్షులకు అండగా నిలుస్తానని, అధికారులతో సమన్వయం చేసుకుంటూ చట్టప్రకారం వారికి దక్కాల్సిన అన్ని హక్కులు, అవకాశాలు అందేలా చూస్తానని స్పష్టం చేశారు. తన నియామకానికి సహకరించిన ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు, జిల్లా అధికార యంత్రాంగానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఖమ్మం రైల్వే స్టేషన్ పనులు పూర్తి కాకపోతే ముట్టడి చేస్తాం

## కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని స్టేషన్ మేనేజర్ కు వినతిపత్రం

ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 21 ( జనం సాక్షి )

సంవత్సరాల తరబడి ఖమ్మం రైల్వే స్టేషన్ పనులు చాలా నత్తనడక సాగుతున్నాయి అని, ప్రయాణికులను ఇబ్బంది పెడుతున్న సదరు కాంట్రాక్టర్ పై తక్షణమే చర్యలు తీసుకోవాలి అని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం అఖిల పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం రైల్వే స్టేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ మేనేజర్ కు వినతిపత్రం సమర్పించారు. రైల్వే స్టేషన్ అంతా బృందం కలియతిరిగి అధ్వానంగా నడుస్తున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ మూడు సంవత్సరాల నుండి పనులు చాలా నత్తనడక గా ఆధునీకరణ పనులు నడుస్తుంటే ఖమ్మం పార్లమెంట్ సభ్యులు ఏమి చేస్తున్నారు అని ప్రశ్నించారు. మూడు ప్లాట్ ఫాం లపై అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు వుంది ఆరోపించారు. 34 కోట్లతో అభివృద్ధి పనులు అంతా చాలా నెమ్మదిగా నడవటం తో రోజు వేలాది మంది ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు అని విమర్శించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం పై ఖమ్మం పార్లమెంట్ సభ్యులు వెంటనే పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని డిమాండ్ చేశారు. మంచి నీటి సౌకర్యం లేదు అని, ఎస్కలేటర్లు , లిఫ్ట్ పనులు పూర్తి స్థాయిలో కూడా చేయలేదు అని ఆరోపించారు. వెయిటింగ్ హాల్ పనులు పెండింగ్ లో వున్నాయి అని విమర్శించారు. రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారం వద్ద ముఖ్యమైన ఆఫీస్ కార్యాలయం, టికెట్ కౌంటర్ హాల్, అధికారుల ప్రధానమైన ఆఫీస్ లు ఇలా అన్ని పనులు నత్తనడకన నడుస్తున్నాయి అని విమర్శించారు. రాబోయే మూడు నెలల్లో రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు పూర్తి కాకపోతే రైల్వే స్టేషన్ ను ముట్టడి చేస్తామని ఈ సందర్భంగా నున్నా నాగేశ్వరరావు



హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీనివాసురావు, మాదినేని రమేష్, మెరుగు సత్యనారాయణ, నాజీూ జబ్బార్, దొంగల తిరుపతిరావు, భుక్యా శ్రీనివాసురావు, నాగుల మీరా, బోడపట్ల సుదర్శన్, వజినేపల్లి శ్రీనువాసురావు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి జన్మదిన వేడుకలు

○20 పంచాయతీల్లో ఉత్సాహంగా బత్తుల అంజి బర్త్‌డే సంబరాలు

○మండల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి: మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి



**ములకలపల్లి, ఆగస్టు 21 జనం సాక్షి :** మండలంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు బత్తుల అంజి జన్మదిన వేడుకలను శుక్రవారం అభిమానులు, నాయకులు, స్థానికులు ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని చాపరాలపల్లి, కమలాపురం, మాదారం, పూసుగూడెం, వీకే రామవరం, సీతారాంపురం, సీతాయిగూడెం, జగన్నాథపురం, పత్తిలాలతో సహా సుమారు ఇరవై గ్రామ పంచాయతీల్లో ఈ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి.?గ్రామాల్లో అభిమానుల సమక్షంలో ఆయన కేక్ కట్ చేసి శుభాకాంక్షలు స్వీకరించారు. అనంతరం బత్తుల అంజి మాట్లాడుతూ.. శ్రావణ శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకుని వరలక్ష్మీ అమ్మవారి ఆశీస్సులతో మండల ప్రజలంతా సుఖసంతోషాలు, పాడిపంటలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రముఖులు ఎండి. జహీరుద్దీన్, తాండ్ర ప్రభాకరరావు, ఈర్ల రామ్మోహన్ రావు, సురభి రాజేష్, గుంట్రు సాయి, శివ, ముదుగొండ శివ, పాలకుర్తి సుమిత్, పి రవి, తిరుపతి, ప్రసాద్, నల్లమోతు జగదీష్, తన్నీరు లోకేష్, వెంకటేష్, సంపత్, రవి, నాగరాజు, పత్తిలాల్, రాంబాబు, సోయం నాగరాజు, కృష్ణ, ప్రశాంత్ తదితరులతో పాటు పలు గ్రామాల ప్రముఖులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## 24వ వార్డులో సీసీ రోడ్ల పనులకు శ్రీకారం

**ఖమ్మం రూరల్ ఆగస్టు 21:(జనం సాక్షి )** ఏదులాపురం మున్సిపాలిటీ 24వ వార్డులో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. వార్డులోని ప్రధాన రహదారుల అభివృద్ధిలో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. దీంతో ఏళ్లుగా రహదారుల సమస్యతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపశమనం కలగనుంది.రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక చొరవతో సీసీ రోడ్ల పనులకు నిధులు మంజూరయ్యాయని వార్డ్ కౌన్సిలర్ తెలిపారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్న మంత్రి ఆదేశాల మేరకు మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్‌రెడ్డి పర్యవేక్షణలో మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.తొలుత 24వ వార్డు కౌన్సిలర్ బానోత్ భాస్కర్ కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24వ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. సీసీ రోడ్లతో పాటు డ్రైనేజీ, వీధి దీపాలు, తాగునీటి సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఏళ్లుగా దెబ్బతిన్న రోడ్లతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని,సీసీ రోడ్ల నిర్మాణంతో తమ సమస్యలు పరిష్కారం కానున్నాయని అన్నారు. వర్షాకాలంలో బురద, దుమ్ముతో ఎదురవుతున్న ఇబ్బందులు తొలగనున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో బానోతు మోహన్, బోడబద్రు,బానోతు శంకర్, బానోత్ రామచంద్రు, సునావత్ మోహన్ దాస్, బానోతు జానయ్య,బోడ రాంబాబు స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## కక్ష సాధింపు రాజకీయాలు ఇకనైనా మానుకోవాలి

○ప్రజాస్వామ్య పద్ధతిలోనే సమాధానం చెబుతాం..

○బీఆర్ఎస్ కార్యకర్తలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కందాల..



**ఖమ్మం రూరల్, ఆగస్టు 21:(జనంసాక్షి )** రాజకీయ కక్ష సాధింపులకు కాలం చెల్లిందని, ఇది ప్రాచీన యుగం కాదని..కక్ష సాధింపు రాజకీయాలు ఇకనైనా మానాలని పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అన్నారు. భయభ్రాంతులకు గురిచేసి రాజకీయ ఆధిపత్యం సాధించాలనుకోవడం సరికాదని హితవు పలికారు. ప్రజల మనసులు గెలుచుకునేలా మంచితనంతో రాజకీయాలు చేయాలని సూచించారు.శుక్రవారం ఖమ్మం రూరల్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్‌తో కలిసి కందాల ఉపేందర్‌రెడ్డి ఖమ్మం రూరల్ మండలంతో పాటు ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో విస్తృతంగా పర్యటించారు. తొలుత గూడూరుపాడులో ఇటీవల దాడిలో గాయపడిన బీఆర్ఎస్ కార్యకర్త మార్తి రామారావు, మరో బాధితుడు బట్టు రామారావును పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ విభేదాలు సహజమేనని, అయితే వ్యక్తిగత కక్షలకు దిగడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ఎలాంటి కారణం లేకుండా పార్టీ కార్యకర్తలపై దాడులకు పాల్పడితే సహించేది లేదని స్పష్టం చేశారు. ఇలాంటి చర్యలకు ప్రజాస్వామ్య పద్ధతిలో తగిన సమాధానం చెప్పడం ఖాయమన్నారు. ప్రజలను భయపెట్టి రాజకీయాలు చేయాలని చూస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు.

**ఆలయాల్లో ప్రత్యేక పూజలు..**

అనంతరం మంగళగూడెంలో నిర్వహించిన పలు ఆలయాల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో కందాల పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. తీర్థాల, సత్యనారాయణపురం, నాయుడుపేట, పొన్నెకల్ గ్రామాల్లో పర్యటించి పలువురు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్, ఏదులాపురం సొసైటీ చైర్మన్ లక్ష్మణ్‌నాయక్, బీఆర్ఎస్ నాయకులు పేరం వెంకటేశ్వర్లు, అల్లిక వెంకటేశ్వరరావు,గూడా సంజీవ రెడ్డి, మట్టా వెంకటేశ్వరావు,గుండు శ్రీనివాస్,మేకల ఉదయ్ కుమార్,మునిగంటి భార్గవ్ ఆయా గ్రామాల పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## రుణమాఫీ, సాదా బైనామా పట్టాల కోసం రైతు సంఘాల నిరసన

**చండ్రుగొండ, ఆగస్టు 21 (జనంసాక్షి):** రుణమాఫీ, సాదా బైనామా భూములకు పట్టాల జారీ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని రైతు సంఘాలు, గిరిజన సంఘాల నాయకులు నిరసన తెలిపారు. సాదా బైనామా భూములకు ఇప్పటివరకు పట్టాలు జారీ చేయకపోవడంతో గిరిజన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సాదా బైనామా భూములకు వెంటనే పట్టాలు జారీ చేసి, అర్హులైన రైతులందరికీ రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత


### ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి

**వలిగొండ, ఆగస్టు 21 (జనంసాక్షి)** మండలంలో అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు చర్యలు చేపట్టారు. శుక్రవారం ఎలాంటి అనుమతులు లేకుండా మోటకొండూరు నుంచి పులిగిల్లకు, మూసీ నది నుంచి సంగెం గ్రామానికి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని, సంబంధిత డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

## ఆగస్టు 25న దీక్షలు -ఎస్ డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు

**ఖమ్మం, ఆగస్టు 21 (జనంసాక్షి)** ప్రభుత్వం,ఆర్టీసీ అధికారులతో జరిగిన చర్చలలో అంగీకరించిన అంశాలు అమలు చేయాలనీ డిమాండ్ చేస్తూ 2026 ఆగస్టు 25 న అన్ని డిపో,రీజియన్ స్థాయిలో ఒక్క రోజు నిరాహార దీక్షలు జరపాలని ఆగస్టు 19 న ఖమ్మం లో ఎస్ డబ్ల్యూఎఫ్ అధ్యక్షులు వీరాంజనేయులు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం పిలుపును ఇచ్చింది.ఎస్ డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వివెస్ రావు ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని జనరల్ బాడీ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. కొండనాలుక్కి మందేస్తే, ఉన్న నాలుక ఊడిందనే సామెత లాగా వుంది నేటి ఆర్టీసి కార్మికుల పరిస్థితి.సంపూర్ణ ఐక్యతతో సమ్మె చేసి 7 సం"రాల తర్వాత ప్రభుత్వ చొరవతో కార్మిక సంఘాలతో యాజమాన్యం చర్చలు నిర్వహించి,అంగీకరించిన అంశాలు కూడా అమలు చేయడంలో ఆలస్యం చేస్తున్నారు.అంగీకరించిన అంశాలు అమలు చేయాలన్న డిమాండుతో ఎస్ డబ్ల్యూఎఫ్ చేసిన ఆందోళన వల్ల జాబ్ సెక్యూరిటీ కమిటీని నియమించడంతో పాటు బోర్డు మీటింగ్ కూడ నిర్వహించారు. అయినా అమలు ఆలస్యం అవుతున్నది.కాబట్టి అంగీకరించిన అంశాలు, అమలు చేయాలని,కార్మిక సంఘాలతో చర్చించి పెంచిన పని భారాలను తగ్గించాలని,ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర డిమాండ్ల పరిష్కారం కోరుతూ 2026 ఆగస్టు 25న అన్ని డిపో,రీజియన్ కేంద్రాలలో నిరాహార దీక్షలు జరపాలని టిఎస్ ఆర్టీసి స్టాఫ్ ఉ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపు ఇచ్చింది.ఈ దీక్షలలో కార్మికులు యూనియన్ అనుబంధాలకు అతీతంగా పాల్గొని జయప్రదం చేయాలని టి ఎస్ ఆర్ టి సి,స్టాఫ్ ఉ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటి అధ్యక్షులు వీరాంజనేయులుప్రధాన కార్యదర్శి: వివెస్ రావు ప్రకటన చేశారు.

## రేషన్ స్మార్ట్ కార్డులు పంపిణీ చేసిన గ్రామపరిపాలన.అధికారి




**పాలేరు ఆగస్టు (21) జనంసాక్షి.** రేషన్ స్మార్ట్ కార్డులు పైనంపల్లి సర్పంచ్ ధారావత్ సరోజిని అధ్యక్షతన. జరిగిన గ్రామ సభలో. గ్రామ పరిపాలన అధికారి. లక్ష్మణ్ పంపిణీ చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రేషన్. స్మార్ట్ కార్డులు ఎవరి. పేరుమీద.వారు మాత్రమే రిజిస్టర్ లో. సంతకం చేసి కార్డ్ తీసుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ధారావత్ సరోజిని. గ్రామ కార్యదర్శి జయసింహ రెడ్డి గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రజల ప్రాణాలు పోతున్నా పట్టదా?

**మొండికుంట-మణుగూరు రహదారి అధ్వానం.. ఆర్అండ్‌బీ శాఖపై ప్రజల ఆగ్రహం..**

**అశ్వాపురం ఆగస్టు 21 (జనంసాక్షి):** అశ్వాపురం?మొండికుంట?మణుగూరు ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా మారినా సంబంధిత ఆర్అండ్‌బీ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారి ప్రస్తుతం ప్రమాదాలకు నిలయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రహదారిపై భారీ గుంతలు, ఎగుడుదిగుడులు, విపరీతమైన దుమ్ము కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పించుకునే క్రమంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. గతంలో ఈ మార్గంలో పలుమార్లు ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవించినా అధికారులు శాశ్వత పరిష్కారం చూపకపోవడంపై మండిపడుతున్నారు.మరోవైపు అధిక లోడుతో ప్రయాణించే ఇసుక, బొగ్గు లారీలు, అతివేగ వాహనాల రాకపోకలతో ప్రమాద ముప్పు మరింత పెరిగిందని ప్రజలు అంటున్నారు. రహదారి నుంచి ఎగిసే దుమ్ముతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు."ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు మేల్కొనరా ప్రజల ప్రాణాలకు విలువ లేదా" అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కనీస మరమ్మతులు కూడా చేపట్టకుండా రహదారిని నిర్లక్ష్యం చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇకనైనా ప్రభుత్వం, ఆర్అండ్‌బీ శాఖ ఉన్నతాధికారులు స్పందించి మొండికుంట నుంచి



మణుగూరు వరకు నూతన రహదారి నిర్మాణానికి తక్షణమే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి తక్షణ భద్రతా చర్యలు చేపట్టడంతో పాటు, భారీ వాహనాల నియంత్రణపై కూడా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ప్రజల ప్రాణాలు పోయిన తర్వాత స్పందించడం కాకుండా.. ప్రమాదాలు జరగకముందే ప్రభుత్వం, అధికారులు మేల్కొని రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

## చండూరు వ్యవసాయ మార్కెట్ గోదాములో భారీ చోరీ?

○రాత్రికి రాత్రే మాయమైన వరి ధాన్యం నిల్వలు!

○స్థానికుల పనా..? పరాయి ముఠా దాపురించిందా..?

○మండల వ్యాప్తంగా గుసగుసలు.. విచారణకు ప్రజల డిమాండ్..

**చండూరు, ఆగస్టు 21 (జనంసాక్షి)**

చండూరు వ్యవసాయ మార్కెట్ పరిధిలోని వరి ధాన్యం నిల్వల గోదాములో భారీ ఎత్తున దొంగతనం జరిగిందంటూ.. చండూరు మండల వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గోదాములోని పెద్ద ఎత్తున ధాన్యం బస్తాలు రాత్రికి రాత్రే మాయమయ్యాయన్న ప్రచారం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.గత కొద్ది రోజులుగా మార్కెట్ యార్డులోని నిల్వలపై రకరకాల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గోదాము నుంచి పెద్ద మొత్తంలో ధాన్యం కొల్లగొట్టారని, ఇందులో లక్షలాది రూపాయల విలువైన సరుకు చేతులు మారిందనే గుసగుసలు మండలం లోని గ్రామాలలో వ్యాపించాయి. ఈ ఘటన వెనుక అసలు సూత్రధారులు ఎవరనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.చోరీకి పాల్పడింది స్థానిక వ్యక్తులా.. లేక ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పక్కా ప్రణాళికాబద్ధమైన ముఠానా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంత భారీ పరిమాణంలో ధాన్యాన్ని గుట్టుచప్పుడు కాకుండా వాహనాల్లో తరలించాలంటే స్థానికుల సహకారం లేకుండా సాధ్యం కాదనే అనుమానాలు కూడా స్థానిక ప్రజల్లో బలపడుతున్నాయి.గోదాములో ధాన్యం మాయమైన వ్యవహారంపై అధికారులు గానీ, మార్కెట్ పాలకవర్గం గానీ ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన ప్రకటన చేయకపోవడంపై మున్సిపల్ ప్రజలు, రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, గోదాములోని స్టాక్ రికార్డులను పరిశీలించి, సమగ్ర విచారణ జరిపి అసలు నిజాన్ని ప్రజల ముందుంచాలని ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

## జిల్లా కాంగ్రెస్ కమిటీ అత్యవసర సమీక్షా సమావేశం

**ఖమ్మం, ఆగస్టు 21 (జనంసాక్షి)**



జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన ఈరోజు జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో మండల, పట్టణ అధ్యక్షులతో మరియు జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యులతో అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించనైనది.


ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించటానికి టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మండల,పట్టణ అధ్యక్షులను వారి వారి మండల, పట్టణాలలోని అన్ని బూత్ లకు సూపర్ వైజర్ నియమించారని తక్షణమే అధ్యక్షులు అందరు ఈ బాధ్యతలను స్వీకరించి, అన్ని పోలింగ్ బూత్ ల పర్యవేక్షణ విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మండల, పట్టణ అధ్యక్షులకు దిశా నిర్దేశం చేశారు.అదేవిధంగా ఈ నెల ది 25 వరకు మండల, పట్టణ కమిటీల నియామకం పూర్తి చేయాలని ఈనెల 30 వరకు గ్రామ, వార్డు కమిటీల నియామకం పూర్తి చేయాలని ఆదేశించారు.

కేంద్ర (బి జె పి) హోంమంత్రి అమిత్ షా కాంగ్రెస్ పార్టీని జాతి వ్యతిరేకి విమర్శించడం అహంభావానికి, నిస్వా హాయతకు నిదర్శనం అని నాడు స్వాతంత్ర్య సముపార్జనకు నడుం బిగించి ముఖ్య పాత్ర పోషించిన కాంగ్రెస్ పార్టీని,నాయకులను విమర్శించడం ఆకాశంపై ఉమ్మి వేసిన చందంగా ఉందని ఎద్దేవా చేశారు, దేశ ప్రజలు బీజేపీ కి వ్యతిరేకంగా రానున్న రోజులలో గుణపాఠం చెబుతారని బీజేపీ నాయకుల తీరు జిల్లా కాంగ్రెస్ కమిటీ పక్షాన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ తీవ్రంగా ఖండించారు, కార్యక్రమంలో వీరితో పాటు టి పి సి సి ప్రధాన కార్యదర్శి మద్దినేని బేబీ స్వర్ణకుమారి, జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, మొక్కా శేఖర్ గౌడ్,డాక్టర్ కాపా మురళి కృష్ణ,బొడ్డు బొందయ్య,పుచ్చకాయల వీరభద్రం, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు, మండల, పట్టణ అధ్యక్షులు ,ఇంచార్జి లు పాల్గొన్నారు.

## చండూరు మద్యం దుకాణాలపై ఆర్టీఐలో కీలక సమాచారం కోరిన లింగోజి కిరణ్‌కుమార్

**చండూరు,ఆగస్టు 21 (జనంసాక్షి)**

నల్గొండ జిల్లా చండూరు మున్సిపాలిటీ పరిధిలోని ఏ4 మద్యం దుకాణాలకు సంబంధించిన వివరాలను సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ)?2005 కింద వెల్లడించాలని కోరుతూ ఆర్టీఐ కార్యకర్త లింగోజి కిరణ్‌కుమార్ దరఖాస్తు చేశారు. ఈ దరఖాస్తును నల్గొండ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖకు పంపిస్తూ, సంబంధిత సమాచారాన్ని నేరుగా దరఖాస్తుదారుడికి అందించాలని డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ఆదేశించింది.2026 ఆగస్టు 17న దాఖలైన దరఖాస్తులో, 2021 జనవరి 1 నుంచి ఇప్పటి వరకు చండూరు మున్సిపాలిటీ పరిధిలోని వైన్ షాపులకు సంబంధించిన పలు వివరాలను కోరారు. ఆయా దుకాణాల లైసెన్స్ నంబర్లు, లైసెన్స్‌దారుల పేర్లు, కాలపరిమితి, ఎక్సైజ్ శాఖ నుంచి జారీ చేసిన అనుమతులు, తనిఖీలు, ఉల్లంఘనలకు సంబంధించిన చర్యలు తదితర వివరాలను అందించాలని కోరినట్లు పత్రంలో పేర్కొన్నారు.అలాగే మద్యం దుకాణాలపై నమోదైన కేసులు, పెనాల్టీలు, లైసెన్స్‌లపై తీసుకున్న చర్యలు, నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించిన రికార్డులు, అధికారుల తనిఖీ వివరాలను కూడా వెల్లడించాలని కోరారు. 2021 నుంచి ఇప్పటి వరకు చండూరు పరిధిలో మద్యం దుకాణాలపై నమోదైన ప్రత్యేక తనిఖీలు లేదా ఆకస్మిక తనిఖీల సంఖ్య, వాటికి సంబంధించిన నివేదికలు, చర్యల వివరాలు ఇవ్వాలని దరఖాస్తులో కోరారు. అలాగే మద్యం



నాణ్యత, అక్రమ విక్రయాలు లేదా ఇతర ఉల్లంఘనలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులు, వాటిపై శాఖ తీసుకున్న చర్యల వివరాలను కూడా అడిగారు. 2021 నుంచి ఇప్పటి వరకు చండూరు పరిధిలో మద్యం దుకాణాలపై నమోదైన ప్రత్యేక తనిఖీలు లేదా ఆకస్మిక తనిఖీల సంఖ్య, వాటికి సంబంధించిన నివేదికలు, చర్యల వివరాలు ఇవ్వాలని దరఖాస్తులో కోరారు. అలాగే మద్యం నాణ్యత, అక్రమ విక్రయాలు లేదా ఇతర ఉల్లంఘనలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులు, వాటిపై శాఖ తీసుకున్న చర్యల వివరాలను కూడా అడిగారు. ఈ సమాచారాన్ని అందుబాటులో ఉన్న అధికారిక రికార్డుల ఆధారంగా పీడీఎఫ్ లేదా ఎలక్ట్రానిక్ రూపంలో అందించాలని దరఖాస్తుదారు కోరారు. సమాచారం అందించడంలో ఏదైనా భాగం సంబంధిత అధికార పరిధిలో లేకపోతే, ఆర్టీఐ చట్టం ప్రకారం సంబంధిత అధికారికి దరఖాస్తును బదిలీ చేయాలని కూడా విజ్ఞప్తి చేశారు.ఆర్టీఐ దరఖాస్తును స్వీకరించిన నల్గొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం, సెక్షన్ 6(3) ప్రకారం సంబంధిత జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్‌కు పంపింది. దరఖాస్తుదారుడికి కోరిన సమాచారాన్ని నేరుగా అందించడంతో పాటు, దాని ప్రతిని డిప్యూటీ కమిషనర్ కార్యాలయానికి పంపాలని ఆదేశించింది.

## ఇందిరమ్మ ఇళ్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలి..

### సిపిఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్

**ఖమ్మం రూరల్, ఆగస్టు 21(జనంసాక్షి):**




ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు ప్రతి ఇందిరమ్మ ఇంటికి ఒక లక్షా అరవై ఐదు వేల రూపాయలు పాత బకాయిలు వెంటనే విడుదల చేయాలని సిపిఎం పార్టీ పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ డిమాండ్ చేశారు.స్థానిక వరంగల్ క్రాస్ రోడ్డులోని తమ్మినేని సుబ్బయ్య భవనంలో వరగాని మోహన్ రావు అధ్యక్షతన జరిగిన సిపిఎం పార్టీ ఖమ్మం రూరల్ మండల కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా బండి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక వాటిలో ఏ ఒక్కటీ అమలు చేయలేదని మండి పడ్డారు. ఇండ్లు ఇస్తాము,ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ప్రజా దర్బారు పేరుతో నిరుపేద ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుని ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా అమలుచేయలేదని అన్నారు. మహిళలకు ప్రతి నెలా 2500 రూపాయలు ఇస్తామని,ఉపాధి హామీ కూలీ లకు సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇస్తామన్న హామీలు ఎటు పోయాయి అని ఎద్దేవా చేశారు.ఇప్పటికైనా రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్ళు,ఇళ్ల స్థలాలను నిరుపేదలకు అందించి బిల్లులను సకాలం లో చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యం లో ఆందోళనలు, ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ ఖమ్మం రూరల్ మండల కార్యదర్శి వర్థమూడి నాగేశ్వరరావు,మండల కార్యదర్శి వర్గ సభ్యులు ప్రతాపనేని వెంకటేశ్వర్లు, పెరుమాళ్ళపల్లి మోహన్ రావు,మండల కమిటీ సభ్యులు చావా నాగేశ్వరరావు, పొన్నం వెంకట రమణ,కారుమంచి గురవయ్య, కొండం కరుణాకర్, భూక్యా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎస్ రద్దు కోరుతూ ఛలో హైదరాబాద్..

### మేనిఫెస్టోలో పెట్టిన విధంగా సి పి ఎస్(కంట్రిబ్యూటరీ పెన్షన్స్ స్కిం) ను వెంటనే రద్దు చేయాలి..

### తుక్కాని శ్రీనివాస రెడ్డి

**కొత్తగూడెం క్రైమ్ ,ఆగస్టు21 (జనంసాక్షి):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేస్తున్న కొత్త పెన్షన్ విధానం ను రద్దుచేసి పాత పెన్షన్ పునరుద్దరించాలనే ఏకైక డిమాండ్ తో ఆగస్టు 23 ఆదివారం రోజు హైదరాబాదు నడిబొడ్డున ఉన్న లాల్ బహదూర్ స్టేడియంలో లక్ష మంది ప్రభుత్వ సిపిఎస్ ఉద్యోగులతో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నట్లు టి ఎస్ సి పి ఎస్ ఈ య తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు తుక్కాని శ్రీనివాస రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలోతెలియజేశారు.. జూలై 11న భద్రాచలం నుండి సిపిఎస్ రద్దు కోరుతూ మొదలైన సిపిఎస్ ఉద్యోగుల జన జాగరణ యాత్ర లో టి ఎస్ సి పి ఎస్ ఈ య రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ గారు మరియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాల్వల శ్రీకాంత్ గారు మరియు రాష్ట్ర కమిటీ మెంబర్స్ 33 జిల్లాలుగా 42 రోజులపాటు 110 మంది ఎమ్మెల్యేలు కలిసి సిపిఎస్ రద్దు కోరుతూ వినతి పత్రాలను అందిస్తూ యాత్రని జూన్ ఆగస్టు 18 తారీకున ముగించడం జరిగింది.. యాత్ర ముగింపు సందర్భంగా ఆదివారం రోజు ఆగస్టు 23 తారీకు హైదరాబాదులో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు దీనికి భద్రాద్రి జిల్లాలోని సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయ మిత్రులందరికీ భారీ సంఖ్యలో హాజరవ్వాలని శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు.. 2023 సాధారణ ఎన్నికలకు ముందు ఇప్పుడున్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం మేము ప్రభుత్వం ఏర్పాటు చేస్తే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో దేశంలోని మిగతా




కాంగ్రెస్ పాలిత ప్రాంతాల్లో మాదిరిగా సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరిస్తామని వరంగల్ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ప్రకటించడం జరిగింది. అలాగే సిపిఎస్ రద్దు చేస్తామని మేనిఫెస్టో లో కూడా పెట్టడం జరిగింది.మాట ఇచ్చిన విధంగా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఈ భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు..